ఈనాడు
అమరావతి
గుంటూరు
బుధవారం మే 14, 2025

ఇన్‌ఛార్జి ఆర్‌డీఎంహెచ్‌వోగా శోభారాణి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు జోన్ ఇన్‌ఛార్జి ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులుగా జి.శోభారాణిని నియమిస్తూ రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు పద్మావతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం ప్రాంతీయ ప్రయోగశాలలో సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్టుగా పనిచేస్తున్నారు. ఆర్డీగా పనిచేస్తున్న సుచిత్ర ఈ నెల 17వ తేదీ వరకు సెలవుపై వెళ్లడంతో ఈ నియామకం అవసరమైంది.

భర్తపై దాడి.. రూ. 80 లక్షలతో భార్య పరార్

బెళుగుప్ప, న్యూస్‌టుడే : కట్టుకున్న భర్తను కుటుంబ సభ్యుల సహకారంతో బెదిరించి, దాడి చేసి ఆస్తులను అమ్మగా వచ్చిన డబ్బుతో పరారైన ఘటన అనంతపురం జిల్లా బెళుగుప్పలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలిలా.. అనంతపురం పట్టణానికి చెందిన దివ్యాంగుడైన ఫయాజ్‌కు పదోన్నతి రావడంతో బెళుగుప్ప ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబానా తెలుగు మాట్రిమోనీలో పరిచయం కావడంతో వివాహం చేసుకున్నారు. ఫయాజ్‌కు చిన్నప్పుడే పోలియో సోకడంతో ఒకరి సహాయం లేనిదే నడవలేరు. దీనిని ఆసరాగా తీసుకున్న భార్య అతని ఆస్తులను కాజేయాలని పథకం పన్నింది. ఇటీవలే ఫయాజ్‌ను ష్యూరిటీ పెట్టి ఆమె అక్క జరీనాబేగం పేరుమీద హెచ్‌డీఎఫ్‌సీలో రూ.30 లక్షలు రుణం తీసుకుంది. అనంతపురంలో ఉన్న ఇంటిని తనకు తెలియకుండా రూ.41 లక్షలకు, ఇంటి స్థలాన్ని రూ.7 లక్షలకు విక్రయించిందని, మరో ఇంటి స్థలం కూడా అమ్మేయాలనడంతో ఎందుకని ప్రశ్నించినందుకు వారి కుటుంబ సభ్యులను పిలిపించి తనపై దాడి చేసి ఇంటిలోని 5 తులాల బంగారం, విద్యార్హత పత్రాలతో పాటు రూ.6 లక్షల విలువైన కారును తీసుకుని ఏప్రిల్ 29న పరారైనట్లు బాధితుడు తెలిపారు. భార్య, వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివ వివరించారు.

16న ఉద్యోగ మేళా

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 16న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిసర ప్రాంత యువత ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మేళా జరుగుతుందని తెలిపారు. వివరాలకు 98668 22697 నంబరును సంప్రదించవచ్చన్నారు.

6.54 కోట్లు తిన్నదెవరో ఆ పార్కుకే తెలుసు!

- నాటి వైకాపా హయాంలో ఇష్టానుసారం పనులు
- మూలనపడ్డ నాసిరకం పరికరాలు

ఈనాడు – అమరావతి

ఏడు లక్షలకుపైగా జనాభా ఉన్న గుంటూరు నగరంలోని ఏకైక పార్కు. నిర్వహణాపరమైన సమస్యలతో కునారిల్లుతోంది. రోజురోజుకు సందర్శకుల ఆదరణకు దూరమవుతోంది. దాదాపు ఏడాది క్రితం రూ. 6.54 కోట్లు వెచ్చించి అప్పటి వైకాపా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏడాది తిరక్కుండానే ఇందులోని ఆట పరికరాలు అటకెక్కాయి. పిల్లలు బాగా ఇష్టపడే ట్రైన్, గేమింగ్ జోన్ వద్ద ఉన్న పరికరాలేవీ పని చేయడం లేదు. నాసిరకం నిధి తేవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని నగరపాలకవర్గాలు చెబుతున్నాయి. మినీ థియేటర్ వినియోగంలోకి రాలేదు. అయినా రూ. కోట్లు ఖర్చు రాసి తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా నాటి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కమీషన్లు దండుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ వెన్నంటి ఉన్న ఎమ్మెల్సీ ఒకరు బినామీ అవతారమెత్తి టెండర్లు లేకుండా సింహభాగం పనుల్ని దక్కించుకుని తన అనుచరులతో చేయించారు. ఆ పనులు ఎలా చేస్తున్నారో ఆరా తీసిన అధికారి లేరు. అసలు టెండర్లు లేకుండా పనులు చేపట్టడమేమిటి వాటిని ఎవరు చేస్తున్నారని నాడు కౌన్సిల్ సమావేశాల్లో పలువురు వైకాపా కార్పొరేటర్లు సైతం మొత్తుకున్నా స్పష్టత ఇవ్వలేదు. ఇలా రూ. 6.54 కోట్లను అప్పనంగా నమిలి మింగేశారు.


మూలనపడ్డ ట్రైన్

- అత్యవసర పనుల పేరుతో మరో రూ. 77.97 లక్షలకు బిల్లులు పెట్టి దోచేశారు.
- ఈ పార్కుకు రోజుకు సగటున ఆరేడు వందలమందికిపైగా పిల్లలు, పెద్దలు వస్తుండే వారు. ప్రవేశ రుసుము రూపంలో నిత్యం రూ. 15 వేల వరకు ఆదాయం వచ్చేది. పరికరాలన్నీ సవ్యంగా పని చేస్తే వాటికి ఫీజుల ద్వారా మరి కొంత ఆదాయం వచ్చేది.
- పచ్చదనం ఆవరణ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. నీళ్లు లభించక ఎండిపోయి కళావిహీనంగా తయారైంది.
- ఇటీవల పార్కుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను ఇంజినీరింగ్ అధికారులకు కేటాయించారు. ఈ విషయంలో గందరగోళం ఏర్పడింది. తొలుత ఈ పనులను ఈఈ కోటేశ్వరరావు చూశారు. ఆయన పర్యవేక్షణ కొనసాగుతున్నా.. పాడైపోయిన పరికరాల గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లలేదు.
- వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు సాయంత్రం సమయాల్లో పార్కుకు వస్తున్నా పరికరాల్లేక ఎక్కువసేపు ఉండడం లేదని బ్రాడీపేటకు చెందిన మానం వెంకటేశ్వరరావు చెప్పారు. పాడైన పరికరాల గురించి అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు.


చెస్ ఆట స్థలం వద్ద పాడైపోయిన బొమ్మలు

మిగులు టీచర్ల సర్దుబాటు

- హేతుబద్ధీకరణతో భర్తీ కానున్న ఖాళీలు
- పుర బడులకు 191 మంది ఎస్ఏల కేటాయింపు

ఈనాడు – అమరావతి

ఉపాధ్యాయుల బదిలీల జీవో వెలువడేలోపే హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియ పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఇంతకుముందు పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారో గుర్తించింది. వీరిని అవసరమైన పాఠశాలల్లో తక్షణమే సర్దుబాటు చేసే ప్రక్రియపై విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో బదిలీల జీవో విడుదలయ్యే అవకాశం ఉందని, ఆలోపుగానే మిగులు టీచర్ల సర్దుబాటు, వర్క్‌లోడ్ ఉన్న చోటకు కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని డీఈవోలకు ఆదేశాలొచ్చాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 58 మండలాల పరిధిలో మిగులు టీచర్ల వివరాలను నిర్ధారిస్తూ సమాచారం పంపాలని మండల విద్యాశాఖాధికారులను మంగళవారం గుంటూరు నోడల్ డీఈవో కార్యాలయం అధికారులు ఆదేశించారు.

★ ఈ ఏడాది మార్చి 31 నాటికి పాఠశాలల్లో ఉన్న ప్రవేశాల సంఖ్య ఆధారంగా హేతుబద్ధీకరణ చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. విద్యార్థులు - ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా ఎక్కడైనా మిగులు టీచర్లు ఉన్నా.. ఏదైనా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే.. అక్కడ సర్దుబాటు చేయడానికి జిల్లా విద్యాశాఖవర్గాలు జాబితా రూపొందిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యేనాటికి టీచర్ల బదిలీల క్రతువు ముగించాల్సి ఉండడంతో హేతుబద్ధీకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నారు.

★ తాజాగా ప్రభుత్వం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను తీసుకొచ్చింది. పిల్లల సంఖ్యను బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇవి 711 ఉన్నాయి. వీటిల్లో నలుగురు సెకండరీ గ్రేడ్ టీచర్లతో పాటు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండాలి. ఇలా సర్దుబాటు చేయడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ★ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 27 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు. అక్కడ కూడా ప్రధానోపాధ్యాయులను నియమించనున్నారు. గుంటూరు జిల్లాలో 9 పాఠశాలలు ఉండగా.. ఇక్కడ ప్రధానోపాధ్యాయులను నియమించారు.



★ పురపాలక, నగరపాలక పాఠశాలల్లో పిల్లల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులను నియమించనున్నారు. జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో మిగులు టీచర్లు ఉంటే అక్కడ సర్దుబాటు చేస్తున్నారు. ఇప్పటివరకు 191 మంది స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేశారు. చాలా ఏళ్ల తరువాత పురపాలక పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ అవుతున్నాయి. 75 మంది పిల్లలుంటే ఒక ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామోపాధ్యాయుడిని నియమిస్తున్నారు. ఆలోపు పిల్లలు ఉంటే హెచ్‌ఎం, పీఈటీలను ఇవ్వకూడదని ఆదేశాలున్నాయి.

★ ముందుగానే ఖాళీల వివరాలను స్పష్టంగా నిర్ధారించుకున్నాక బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టడానికి ఈ కసరత్తు చేస్తున్నామని విద్యాశాఖవర్గాలు తెలిపాయి.

ధరల పతనం.. జీరో వ్యాపారం

పడిపోయిన మిర్చియార్డు ఆదాయం

న్యూస్‌టుడే – మిర్చియార్డు

ఇటీవల ముగిసిన మిర్చి సీజన్లో సరకు పెరిగినా.. యార్డుకు ఆదాయం మాత్రం ఆశించిన రీతిలో రాలేదు. మిర్చి ధరలు తగ్గడం ఒక కారణమైతే.. జీరో వ్యాపారం దండిగా జరగడం మరో కారణం. 2024-25 సీజన్ ప్రారంభమైన గత డిసెంబరు నుంచి మే నెల 12 వరకు మొత్తం 1,09,84,691 బస్తాల (43,93,874 క్వింటాళ్లు)ను రైతులు విక్రయించారు. అదే 2023-24లో 1,00,04,861 బస్తాలు (40,01,942 క్వింటాళ్లు) విక్రయమయ్యాయి. అంటే గతేడాదికంటే ఈసారి అదనంగా 9,79,830 బస్తాలను విక్రయించారు. ఆదాయం దగ్గరకొచ్చేసరికి గతేడాది రూ. 57.29 కోట్లు రాగా.. ఈ సీజన్లో రూ. 38.27 కోట్లకే పరిమితమైంది. అంటే రూ. 19 కోట్ల మేర తగ్గిపోయింది.

★ గతేడాది మార్చిలో కామన్ వెరైటీ మిర్చి రకాల గరిష్ఠ ధర క్వింటాలుకు రూ. 20 వేలు, స్పెషల్ వెరైటీ రకాల ధర రూ. 21 వేలు నమోదవ్వగా.. ఈ సీజన్లో కామన్ వెరైటీ గరిష్ఠ ధర రూ. 14,100; స్పెషల్ వెరైటీ రకాల ధర రూ. 13,300గా ఉంది. గతంతో పోలిస్తే కొన్ని సందర్భాల్లో ధరలు క్వింటాలుకు రూ, 8 వేలు, కొన్ని నెలల్లో రూ. 10 వేల వరకు తగ్గాయని వ్యాపారులు, రైతులు తెలిపారు. అధికారులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకుని ఉంటే ఆదాయం భారీగా పడిపోయి ఉండేది కాదన్నది బహిరంగ వాస్తవం. యార్డులో జీరో వ్యాపారాన్ని అరికట్టాలని స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మిర్చి సీజన్ ప్రారంభమయ్యే ముందు అధికారులను ఆదేశించినా వారిలో కదలిక రాలేదు. అక్రమాలకు అడ్డుకట్ట వేయకుండా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. జీరో వ్యాపారంలో బస్తాలు యార్డు నుంచి బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేదు. టిక్కీకి ఒక రేటు నిర్ణయించి గేట్ల వద్ద వసూలు చేశారు.



మిర్చి క్రయవిక్రయాలకు సంబంధించిన బస్తాల వివరాలు

	2023–24	2024–25
డిసెంబర్	8,81,972	11,08,940
జనవరి	17,41,355	15,68,517
ఫిబ్రవరి	27,98,377	24,45,157
మార్చి	23,06,377	25,79,355
ఏప్రిల్	17,73,590	26,60,617
మే 12 వరకు	5,03,190	6,22,105

మెగా డీఎస్సీకి అవకాశం కల్పించాలి

సీబీఎస్ఈ అభ్యర్థుల వేడుకోలు

ఈనాడు, అమరావతి: సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌తో పదో తరగతి చదివిన వారికి మెగా డీఎస్సీ-25కు దరఖాస్తు చేయడానికి వీల్లేదని అధికారులు చెబుతున్నారని పలువురు అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. పదో తరగతిలో తెలుగు మొదటి లాంగ్వేజ్‌గా చదివిన వారి దరఖాస్తులే స్వీకరిస్తున్నారని వారు వివరించారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌తో చదివిన వారికి తెలుగు రెండో లాంగ్వేజ్ అవుతుందని వివరించారు. దీంతో తమను అనర్హులమని చెబుతున్నారంటున్నారు. దీనిపై హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి తెలియజేశామని, విద్యాభవన్‌లో అధికారులను కలిసి వివరించామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలంటూ ఇప్పటివరకు కాలయాపన చేసి చివరి నిమిషంలో దరఖాస్తు చేయడానికి అనర్హులని చెబుతున్నారని సీబీఎస్ఈ సిలబస్ చదివిన అభ్యర్థులు మండిపడుతున్నారు. రాష్ట్రంలోనే విద్యాభ్యాసం చేసి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు అకడమిక్ సబ్జెక్టుగా చదివి మాతృభాష తెలుగులోనే డీఈఈ సెట్ రాసి ప్రభుత్వ డైట్ కళాశాలల్లో రెండేళ్ల టీటీసీ కోర్సు పూర్తి చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎలా వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఏపీ టెట్‌లోనూ అర్హత సాధించి ఆరేళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తుంటే ఇప్పుడు అనర్హులను చేయటం ఎంత వరకు సమంజసమో ప్రభుత్వం ఆలోచించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. గతంలో డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నప్పుడు ఈ సమస్యే ఉత్పన్నం కాలేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు ఉన్నాయని, మాలాంటి వారికి ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని వివరించారు.

ఆదమరిస్తే..అంతే..!

ఆటోనగర్ నుంచి గుంటూరు బస్టాండ్ వైపునకు వెళ్లే ప్రధాన రహదారిలో రిలయన్స్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న మురుగు కాలువ వద్ద రెండు నెలల కిందట రోడ్డు అంచు కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. అటుగా రాకపోకలు సాగించే వేలాది వాహనదారులు భయపడుతున్నారు. అదుపు తప్పి ఎవరైనా అంచు వైపునకు వెళితే అంతే.. ఇప్పటికైనా గుంటూరు కార్పొరేషన్ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పెదకాకాని



పనితీరు అట్టడుగున!

- జిల్లా వైద్యారోగ్య శాఖకు వచ్చిన మార్కులు 76.04
- రాష్ట్రంలో 22వ ర్యాంకు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, మాతాశిశు ఆరోగ్యం తదితర 11 అంశాల్లో రాష్ట్రంలో గుంటూరు జిల్లా 22వ స్థానంలో నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం ర్యాంకులు వెల్లడించింది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన సమాచారం ఆధారంగా వీటిని కేటాయించారు. కొత్తగా ఏర్పాటైన పల్నాడు, బాపట్ల జిల్లాలు మెరుగైన ర్యాంకులు సాధించడం గమనార్హం. మొత్తం వంద మార్కులకుగాను గుంటూరు జిల్లాకు 76.04, బాపట్ల జిల్లాకు 79.47, పల్నాడు జిల్లాకు 80.07 మార్కులొచ్చాయి.

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుకు మొత్తం 10 మార్కులు కేటాయించగా.. జిల్లాకు కేవలం 5.08 మార్కులే వచ్చాయి. అంటే వీటి పనితీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎవరు ఎప్పుడు వస్తున్నారో? ఏం చేస్తున్నారో తెలుసుకోలేని దుస్థితి ఉన్నట్టు తేలింది. ప్రస్తుతం ఇద్దరు వైద్యాధికారులను నియమించినప్పటికీ వాటి పనితీరు దారుణంగా ఉండడం గమనార్హం.
- మాతాశిశు ఆరోగ్యానికి 25 మార్కులకుగాను 20.68; ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే, ఆరోగ్య సంరక్షణకు 25 మార్కులకుగాను 19.01 వచ్చాయి.
- ఎన్‌యూహెచ్ఎం, వ్యాధుల నియంత్రణ, డీహెచ్ఎస్‌కు 25 మార్కులకుగాను 21.87 వచ్చాయి.
- ఆభ, ఎఫ్ఆర్ఎస్, కుటుంబ నియంత్రణ, క్వాలిటీకి 15 మార్కులకుగాను 9.4 మాత్రమే దక్కాయి.



ముందుగానే ప్రకటించినా

జిల్లా వైద్యారోగ్యశాఖ పనితీరు ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చాలా ముందుగానే ప్రకటించింది. ఇందుకోసం శిక్షణ కూడా ఇచ్చింది. అయినప్పటికీ చిట్టచివరి నుంచి ఐదో స్థానంలో నిలవడం గమనార్హం. ఈ సంవత్సరమైనా మంచి ర్యాంకు సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఉండవల్లి కొండపై ఎగసిన మంటలు

తాడేపల్లి మండలంలోని ఉండవల్లి కొండపై మంగళవారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఎండిపోయిన ముళ్లకంపలు, గడ్డి అధికంగా ఉండడంతో తీవ్రత బాగా పెరిగింది. కొండ దిగువన ఉన్న ఇళ్ల యజమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానికులిచ్చిన సమాచారం మేరకు రంగంలోకి దిగిన అగ్నిమాపక అధికారులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండుగంటలపాటు శ్రమించినా ఎక్కడా అదుపులోకి రాలేదు. **- న్యూస్‌టుడే, తాడేపల్లి**



నిరంతరం విద్యుత్తు ఇవ్వాల్సిందే

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: గుంటూరు సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు నిరంతర విద్యుత్తు సరఫరా జరిగేవిధంగా చూడాలని పర్యవేక్షక ఇంజనీరు కేవీఎల్ఎన్ మూర్తి సూచించారు. విద్యుత్తు భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన విద్యుత్తు సర్వీసుల మంజూరులో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నూతన విద్యుత్తు లైన్ల నిర్మాణ పనులు వర్షాకాలం ప్రారంభం కాకముందే పూర్తి చేయాలన్నారు. విద్యుత్తు బిల్లుల వసూళ్లలో నూరుశాతం లక్ష్యం సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యుత్తు చౌర్యాన్ని అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు.

పోలీసుల కట్టడి.. ముట్టడి

- అదుపులో సెల్‌ఫోన్ల దొంగ
- 60 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోల స్వాధీనం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామిరెడ్డితోటలో మంగళవారం పోలీసులు కట్టడి..ముట్టడి నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్; కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు సీఐలు వీరయ్యచౌదరి, శివప్రసాద్, సోమయ్యలతో పాటు 80 మంది పోలీసులు ఒక్కసారిగా రామిరెడ్డితోటలో తనిఖీలు చేపట్టారు. పలువురి గుర్తింపు కార్డులు, ఆటోలు, ద్విచక్రవాహనాల పత్రాలు పరిశీలించారు. అనుమానితుల వేలిముద్రలను సాంకేతిక పరిజ్ఞానంతో తనిఖీ చేశారు. ఈ క్రమంలో విజయనగరానికి చెందిన ఓ సెల్‌ఫోన్ దొంగను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నలుగురు రౌడీషీటర్లు, ఇద్దరు సస్పెక్ట్ షీటర్లు ఉన్నట్టు గుర్తించారు. సరైన పత్రాల్లేని, నంబరు ప్లేట్లు లేని 60 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. పత్రాలు చూపించి తీసుకెళ్లొచ్చని తెలిపారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిరోధించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు.


తనిఖీల్లో పోలీసులతో ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ అబ్దుల్ అజీజ్

అండగా బీమా

- ఉపాధి కూలీలకు రెండు పథకాలు
- దరఖాస్తుకు నెలాఖరు వరకు గడువు

న్యూస్‌టుడే – పొన్నూరు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు బీమా సౌకర్యం కల్పించి కేంద్ర ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. క్షేత్రస్థాయిలో పని చేస్తున్నప్పుడు వివిధ కారణాలతో కొంతమంది మృతి చెందుతున్నారు. కుటుంబ యజమానిని కోల్పోయిన కుటుంబాలు ఆధారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇలాంటివారికి అండగా ఉండేందుకే కేంద్రం రెండు బీమా పథకాలను ప్రవేశపెట్టింది.

సురక్ష... బీమా యోజన...: 18 ఏళ్ల నుంచి 70 సంవత్సరాల మధ్య వయసున్నవారు బీమా చేయించుకోవచ్చు. ఏటా ప్రీమియం రూ. 20 చెల్లించాలి. ప్రమాదవశాత్తు కూలీ మృతి చెందినా.. పూర్తిగా వైకల్యం కలిగినా కుటుంబానికి రూ. 2 లక్షలు, పాక్షిక వైకల్యం చెందితే రూ. లక్ష చెల్లిస్తారు.

జీవన జ్యోతి...బీమా యోజన... 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు కుటుంబ యజమాని మాత్రమే అర్హులు. ఏటా ప్రీమియం రూ. 436 చెల్లించాలి. ప్రమాదంలో మరణిస్తే కుటుంబానికి రూ. 2 లక్షలు అందుతాయి.

ఉపాధి కార్డులు
1.20 లక్షలు
వేతనదారులు
2.08 లక్షలు

ఈ పథకాల్లో చేరడానికి ఈ నెల 31 వరకు గడువు ఉంది. దరఖాస్తును పూర్తి చేసి ఖాతా ఉన్న బ్యాంకులోగానీ, తపాలా శాఖలోగానీ అందించాలి. దరఖాస్తు ఇచ్చేటప్పుడు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. సంబంధిత కూలీ ఖాతా నుంచి జమ చేసుకుంటారని అధికారులు తెలిపారు. కూలీలకు నచ్చిన పథకంలో చేరాలని ప్రోత్సహిస్తున్నామని పొన్నూరు ఎంపీడీవో చంద్రశేఖర్ చెప్పారు.


గాయంవారిపాలెంలో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఇళ్ల మంజూరుకు 8 వేల మంది నిరీక్షణ

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద సొంతిళ్ల నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 1.80 లక్షలకు అదనంగా సాయం పెంచి ఇస్తామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కూటమి ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సుమారు 8 వేలమంది ఆశగా ఎదురుచూస్తున్నారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఇళ్లు నిర్మించాల్సిన కుటుంబాలను గుర్తించి వారితో దరఖాస్తు చేయించారు. అప్పట్లో వైకాపా ప్రభుత్వం ప్రకటించిన రూ. 1.80 లక్షలు సరిపోవని వీరంతా ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. మరికొందరు పనులు ప్రారంభించి నగదు చాలక మధ్యలో ఆపేశారు. వీరి ఇబ్బందులు గుర్తించిన కూటమి ప్రభుత్వం పీఎంఏవై 2.0 కింద గృహ నిర్మాణానికి కేంద్ర వాటా కింద రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ. లక్ష చొప్పున సాయం అందిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలోనే ఇళ్ల నిర్మాణ మంజూరు ఆర్డర్ ఇస్తే పనులు చేపడతామని వారంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ వేసవిలో నిర్మాణం ప్రారంభిస్తామని, వర్షాలు కురిస్తే పనులకు ఇబ్బంది అవుతుందంటున్నారు. దీనిపై ఇంతవరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.


ప్రస్తుతం లబ్ధిదారులు ఉంటున్న ఇళ్లు



బీటెక్ ఫలితాలు విడుదల

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో గతేడాది డిసెంబరులో నిర్వహించిన బీటెక్ మూడో ఏడాది మొదటి సెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మొత్తం 833 మంది పరీక్ష రాయగా 683 మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష పత్రాల పునఃమూల్యాంకనకు ఒక్కో పేపర్‌కు రూ.2,070లను ఈనెల 22లోపు చెల్లించాలని సీఈ ఆలపాటి శివప్రసాద్ చెప్పారు.

బీపీఈడీ, డీపీఈడీ..

ఏఎన్‌యూ పరిధిలోని వ్యాయామ కళాశాలల్లో జనవరిలో నిర్వహించిన బీపీఈడీ, డీపీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. బీపీఈడీలో 374 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 342 మంది, డీపీఈడీ మూడో సెమిస్టర్‌లో 86 మంది రాయగా 78 మంది ఉత్తీర్ణత సాధించారు. పునఃమూల్యాంకనకు ఈనెల 22లోపు ఒక్కో పేపర్‌నకు రూ. 1,860లను చెల్లించాలని సీఈ తెలిపారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

ఈత కొడుతూ.. సందడి చేస్తూ..

వేసవిలో శిక్షణకు చిన్నారుల ఆసక్తి ● కిటకిటలాడుతున్న కొలనులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

వేసవి సెలవుల్లో పిల్లలకు ఆహ్లాదం.. ఆరోగ్యం కలిగించే ఆటవిడుపు 'ఈత'. ఇందులో పిల్లలకు తర్ఫీదు ఇప్పించేందుకు తల్లిదండ్రులు సైతం మక్కువ చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా సమయం కేటాయించి వారికి కొలనుల వద్ద తీసుకొస్తున్నారు. కృష్ణానదీ తీరంలో అమరావతి కరకట్ట వెంబడి మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అతిథిగృహ ప్రాంగణంలోని 'ఆక్వా డెవిల్స్', పెదవడ్లపూడి వెళ్లే మార్గంలో తెనాలి రోడ్డు పక్కనే మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ నిర్మించిన ఈతకొలనుల వద్ద తాడేపల్లి, మంగళగిరి, ఉండవల్లి, సీతానగరం, విజయవాడ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, పెద్దలతో సందడి వాతావరణం కనిపిస్తోంది.



కూర్చుని కాళ్లతో ఈత నేర్చుకుంటున్న బాలబాలికలు

ఎక్కడ.. ఎప్పుడు..

ఆక్వా డెవిల్స్‌లో ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుండగా.. ఆరేళ్ల నుంచి 17 ఏళ్ల బాలబాలికలు ఇందులో పాల్గొంటున్నారు. ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు ఈతలో మెలకువలు నేర్చుకుంటున్నారు.

☛ మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థకు నిర్మించిన ఈతకొలనులో చిన్నారులు, పెద్దలు ఈతలో శిక్షణ తీసుకుంటున్నారు. వీరి కోసం వేర్వేరుగా స్విమింగ్ పూల్స్ ఉన్నాయి. రోజూ ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు తర్ఫీదు ఇస్తారు.

ఆనందంగా ఉంది: -హేతిక, అక్షయ, హాసినీ



ఈత నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. గతంలో విజయవాడ వీఎంసీ ఈత కొలనులో నేర్చుకున్నాం. ఈ ఏడాది ఆక్వాడెవిల్స్‌లో శిక్షణ పొందుతున్నాం. భవిష్యత్తులో పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తాం.

చూసిన కనులదే భాగ్యం



కల్యాణోత్సవంలో దంపతులు



అలంకరణలో స్వామి

నాగులపాడు(పెదనందిపాడు), న్యూస్‌టుడే: నాగులపాడులోని శృంగేరీ శారదా పీఠపాలిత వల్లీదేవసేన సమేత స్వామి దేవాలయంలో గత వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా ముగిశాయి. ఆలయపాలక మండలి ఆధ్వర్యంలో శనగల సత్యనారాయణశర్మ, చిట్టా పవన్‌కుమార్‌శర్మ, పండితులు స్వామివారి కల్యాణ క్రతువును 47 మంది దంపతులచే నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ పాలక మండలి వారు, గ్రామస్థులు దాతల సహకారంతో భక్తులకు భారీ అన్నదానం చేశారు. చిలకలూరిపేటకు చెందిన రైతన్న మిల్క్ డెయిరీ వారు 5వేల మజ్జిగ ప్యాకెట్లు, నాగులపాడుకు చెందిన నాదెండ్ల గురుమూర్తి, గణపవరానికి చెందిన రేవతి, రేణుక బి.గోవిందరాజు, డి. సత్యనారాయణరాజుల పేరిట భక్తులకు మజ్జిగ, మంచినీళ్ల సీసాలు, మామిడి పండ్లు పంపిణీ చేశారు.

కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్ నేడు



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: వరదలు, తుపానులు, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అధిక నష్టం, ప్రాణహాని జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మాక్‌డ్రిల్ నిర్వహణపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. డీఆర్వో ఖాజావలి మాట్లాడుతూ విపత్తుల నిర్వహణకు సంబంధించి అగ్నిమాపక, పోలీసు, ఎన్‌డీఆర్‌ఎఫ్, వైద్యారోగ్యం తదితర శాఖలు తక్షణం స్పందించడం, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు అవసరమైన వైద్య సహాయాన్ని సకాలంలో అందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో కార్యాలయాల్లో ఉద్యోగులు స్పందించాల్సిన విధానంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. విపత్తు నిర్వహణ శాఖ జిల్లా మేనేజర్ ఎ. లక్ష్మీకుమారి, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణబాబు, డీసీహెచ్‌ఎస్ మయానా మజీదాబి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ముఖ్య భద్రతాధికారి తనిఖీ

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నంద్యాల-దొనకొండ సెక్షన్లలో రైల్వే ముఖ్య భద్రతాధికారి(సీఆర్‌ఎస్) మాధవి మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేశారు. వంతెనలు, సొరంగాలను పరిశీలించారు. సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం పని చేస్తున్నారా? లేదా? చూశారు. ఆమె తన పరిశీలనలో గమనించిన లోపాలపై ప్రత్యేక నివేదిక ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సైమన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సిగ్నలింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న మాధవి

పోతేపోనీ.. ప్రజాధనమేగా!

ప్రజాధనం వెచ్చించేటప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పనుల్లో నాణ్యత ఉండాలి. పదికాలాలపాటు మన్నిక ఉండాలి. అంతకుమించి ప్రజలకు ఉపయోగపడాలి. కానీ.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గుంటూరు నల్లచెరువురోడ్డు సమీపంలోని ఆగతవరప్పాడులో అస్తవ్యస్తంగా నిర్మించిన కాలువలతో ఇలా యాతన అనుభవిస్తున్నారు. రహదారికన్నా ఎత్తుగా మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మించారు. దీంతో ప్రజలు ఉపయోగించే మార్గం పూర్తిగా పల్లంలో ఉండిపోయింది. వర్షం వస్తే నీరు వెళ్లే దారి లేక ఇళ్లలోకి వచ్చేస్తోంది. అంతే కాదు కాలువలను నాసిరకం నిర్మించడంతో రెండేళ్లు కాకముందే పగుళ్లు తేలి పాడైపోతున్నాయి. - ఈనాడు, గుంటూరు.



ఆగతవరప్పాడులో కల్వర్టు ఎత్తుగా రహదారులు లోతుగా



నాసిరకం పనులతో పాడైపోతున్న మురుగుకాలువలు



రహదారుల కన్నా కాలువలు ఎత్తుగా నిర్మించి

సీబీఎస్‌ఈ ఫలితాల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఏఐఎస్ఎస్‌ఈ(సీబీఎస్‌ఈ)- 2025 పదోతరగతి ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం విడుదలైన సీబీఎస్‌ఈ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు. రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం బ్లూమ్స్ విద్యార్థి స్వామి కృష్ణమణి శ్రీహర్ష 500 మార్కులకు 492 మార్కులు సాధించి గర్వకారణంగా నిలిచారన్నారు. ఎ.సాయినిఖిత 490, టి.అనీష్ 489, బి.లిఖిత్‌మనోజ్ఞ, పి.శ్రీసాయిమిత్ర, ఎ.శ్రీహరిణి 488, యు.యశ్వంత్‌సాయి 486, కె.స్నిగ్ధ, ఎస్.మణియశ్వంత్, పియూష్ పోడికర్, ఇ.రిషిక, డి.శ్రీహరిణి 485 మార్కులు సాధించి విశేష ప్రతిభ చూపారన్నారు. 480పైగా 23, 470పైగా 63, 450పైగా 146 మంది మార్కులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయం నమోదు చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్‌లు అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్

ఐఐటీలో బీటెక్ చేయాలని లక్ష్యం - స్వామి కృష్ణమణి శ్రీహర్ష 492.



మాది గుంటూరు నగరం. నాన్న సాయిసుధాకర్ ఆర్కిటెక్ట్, అమ్మ లక్ష్మి మాధురి గృహిణి. నిత్యం పాఠశాలలో తరగతులతోపాటు ఇంటి వద్ద కూడా మూడు గంటలు తప్పకుండా చదువుతాను. పాఠశాలలో పెట్టిన పరీక్షలు.. ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనలు పాటించడం వల్లే నాకు మంచి మార్కులు వచ్చాయి. ఇంటర్‌లో ఎంపీసీ పూర్తి చేసి.. ఐఐటీలో బీటెక్ చేయాలన్నది నా లక్ష్యం.

జడ్పీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్తు ఆస్తుల పరిరక్షణతో పాటు భూములు ఆక్రమణలకు గురి కాకుండా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అన్నారు. జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అధ్యక్షతన నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. క్రిస్టినా మాట్లాడుతూ జడ్పీకి సంబంధించి రేవుల వేలం పాటలు, దుకాణాల సముదాయాలు, కల్యాణ మండపాల నుంచి రావాల్సిన బకాయిల గురించి అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, సభలు, సమావేశాల్లో విధిగా ప్రొటోకాల్ పాటించాలని స్పష్టం చేశారు. సీఈవో జ్యోతిబసు మాట్లాడుతూ మండలాల్లో ఆడిట్‌ని త్వరితంగా పూర్తి చేయాలన్నారు. పరిపాలన అంశాలపై సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, ఏవో పి.శామ్యూల్‌పాల్, ఎంపీడీవోలు, ఏవోలు, జడ్పీ విభాగాల ఏవోలు పాల్గొన్నారు.

ల్యాండ్ రికార్డుల డిజిటలైజేషన్‌పై 15, 16 తేదీల్లో గుంటూరులో కార్యశాల

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ల్యాండ్ రికార్డుల డిజిటలైజేషన్‌పై గుంటూరులోని వెల్కమ్ హోటల్‌లో ఈనెల 15, 16 తేదీల్లో కార్యశాల నిర్వహిస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఆధునిక సాంకేతికతతో కూడిన భూ రికార్డులు అందించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. డిజిటల్ ఇండియాలో భాగంగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ల్యాండ్ రికార్డుల ఆధునికీకరణపై రెండు రోజుల కార్యశాల నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి మనోజ్ జోషి, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు హాజరవుతారని పేర్కొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతుల సంఘం నాయకులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కౌలు రైతులకు తక్షణం గుర్తింపు కార్డులు జారీ చేయాలని, సొంత భూమి లేని కౌలురైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. పి.జమలయ్య మాట్లాడుతూ గతేడాది జారీ చేసిన గుర్తింపు కార్డులకు కాలపరిమితి ముగిసిందని, ఈ ఏడాది కొత్తగా కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయకుండా అన్నదాత సుఖీభవ పథకం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కౌలురైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. ముందుగా భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, అందులో భూమి లేని కౌలు రైతులను గుర్తించి అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి కౌలురైతు కుటుంబానికి రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.2 లక్షల వరకు ఎటువంటి హామీ లేని పంట రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంజులరెడ్డి, పీవీ జగన్నాథం మాట్లాడుతూ జిల్లాలో కౌలు వ్యవసాయమే కీలకంగా ఉందని, ఆహార, వాణిజ్య, ఉద్యాన తదితర పంటలు పండిస్తుంది 90 శాతం కౌలురైతులేనన్నారు. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అందడం లేదన్నారు. ధర్నాలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేడా హనుమంతరావు, ఎ.అరుణ్‌కుమార్, నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా చూడండి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఇంటర్మీడియట్ (ఓపెన్‌స్కూల్) పబ్లిక్ పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు జిల్లాలో 971 మంది విద్యార్థులు ఆరు కేంద్రాల్లో హాజరవుతున్నారన్నారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని, వైద్యారోగ్య శాఖ వారు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం సక్రమంగా ఉండేలా విద్య, మున్సిపల్ శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈవో సి.వి.రేణుక, పరీక్షల సహాయ కమిషనర్ కె.వెంకటరెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు

తాడేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతి గృహాల స్థానంలో ఆదర్శ ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఉండవల్లిలో విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మంగళవారం తెలిపారు. మారుతున్న శాస్త్ర సాంకతిక నైపుణ్యాభివృద్ధిని అందిపుచ్చుకునే విధంగా ప్రభుత్వ వసతి గృహాలను తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్ర కో-ఆర్డినేటర్ తూనగుంట్ల బ్రహ్మానందశర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు రూ.53 లక్షల జరిమానా

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరిలో విద్యుత్తు విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్లు విజయకృష్ణ, సుబ్రహ్మణ్యం నేతృత్వంలో సిబ్బంది విద్యుత్తు మీటర్లు తనిఖీ చేశారు. మీటరు ఉన్నా విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.53 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరీల్లో వినియోగిస్తున్న తొమ్మిది మంది నుంచి రూ.1.20 లక్షలు, అనుమతించిన లోడుకంటే అదనంగా వాడుతున్న 124 మందికి రూ.10.37 లక్షలు జరిమానా విధించినట్లు డీఈఈ సురేష్‌బాబు మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవరావు, 46 మంది అధికారులు, 189 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి 3121 సర్వీసులను తనిఖీ చేసినట్లు ప్రకటించారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

స్పందనకు వందనం

• ఐనవోలులో కుళాయి నీరు రంగుమారి వస్తోందని, ట్యాంకు శుభ్రం చేయించాలని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించారు. ఐనవోలు పంచాయతీ కార్యదర్శి సాంబిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ట్యాంకు శుభ్రం చేశారు. **- న్యూస్‌టుడే, తుళ్లూరు.**

? మందడం ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ ఏరియాలో విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. **- నాగమల్లేశ్వరరావు**

✔ సీఆర్డీఏ సర్కిల్ ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరరావు, ఏఈ**

19వ తేదీన వైస్ ఎంపీపీ ఎన్నిక

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఎన్నికల కమిషన్ ప్రకటించిన ప్రకారం ఈ నెల 19న వైస్ ఎంపీపీ ఎన్నిక జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 15న ఎంపీటీసీ సభ్యులందరికీ నోటీసులు ఇస్తామన్నారు. మండలంలో ఇద్దరు వైస్ ఎంపీపీల్లో ఒకరు జనసేనకు చెందిన పసుపులేటి సాయిచైతన్య కాగా.. ఒకరు షేక్ జబీన్ ఉన్నారు. ఇటీవల జబీన్ ఎంపీపీ కావడంతో ఉపాధ్యక్ష పదవి ఖాళీ అయ్యింది. ఇప్పుడు తెదేపాకు చెందిన సభ్యుల్లో ఒకరికి ఆ పదవి రానుంది. ఎంపీపీ బీసీ కాబట్టి ఎన్నికల కమిషన్.. వైస్ ఎంపీపీ మరో సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉంది.


31న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండంలోని మేరికపూడిలో గతంలో నిర్మించిన వీరాంజనేయ దేవస్థానంలో ఆంజనేయ స్వామి విగ్రహం పాడైపోవడంతో మంగళవారం బయటకు తీసే క్రతువు(శ్రీకళాపకర్షణ) జరిగింది. ఈ నెల 31వ తేదీ విగ్రహం పునః ప్రతిష్ఠ జరుగుతుందని దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు. రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవ సంస్థ- ఆరోవిల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు జరిగింది. ఏపీఎం సాంబశివరావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలంతా ఈ సేవలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు(అరోవిల) మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు పనితీరు, ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, రాయితీ పథకాలు, బ్యాంకు ఖాతా తదితర అంశాల గురించి తెలిపారు. రిసోర్స్‌పర్సన్ కౌన్సిలర్ శంకరావు, ఆర్డీస్ సెక్రటరీ సాంబశివరావు, సంస్థ కో-ఆర్డినేటర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



సన్మానం అందుకున్న పాలకవర్గ అధ్యక్షుడు కోటేశ్వరరావు, సభ్యులతో ఎంఎంకే స్టేడియం ప్రతినిధులు

మంగళగిరి, న్యూస్‌టుడే: ఆలయాల ప్రతిష్ఠ పెంచి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెదేపా గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి మండల పరిషత్ ఆవరణలో ఉన్న ఎంఎంకే స్టేడియంలో శివాలయ పాలకవర్గ అధ్యక్షుడు బోగి కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు సుకమంచి గిరిబాబు, తిరుమలశెట్టి మురళీకృష్ణలను తెదేపా నాయకులు కొత్తపల్లి శ్రీనివాసరావు బృందం మంగళవారం సత్కరించారు. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని, పాలకవర్గ సభ్యులు అందుబాటులో ఉండి భక్తులు మెచ్చే విధంగా దేవాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిసంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు కోరారు. తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, మునగపాటి మారుతీరావు, షేక్ హుస్సేన్, రేఖా సుధాకర్‌గౌడ్, గాజుల శ్రీనివాసరావు, కొత్తపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి సాయంతో పేదలకు భరోసా



ఈమని: శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న శ్రీఅనిత, నాయకులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఆయా గ్రామాల నాయకులు మంగళవారం అందజేశారు. రేవేంద్రపాడుకు చెందిన నూతక్కి విజయరావుకు రూ.1,84,189, ఈమనికి చెందిన బెల్లంకొండ శ్రీనివాసరావుకు రూ.54,900, శృంగారపురానికి చెందిన శృంగారపాటి మరియమ్మకు రూ.62,466, పెనుమూలికి చెందిన షేక్ నాగులాకు రూ.65,270లు మంజూరు అయ్యింది.

శ్లోకాలు పఠిస్తూ.. కూచిపూడి నేర్చుకుంటూ..

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే

వేసవి సెలవులను ఆ చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. నాలుగేళ్ల చిన్నారుల నుంచి 13 ఏళ్ల బాలబాలికల వరకు భాగస్వాములవుతున్నారు. వేర్పేడు విమలానంద స్వామి వ్యాసాశ్రమానికి అనుబంధంగా దుగ్గిరాలలో ఉన్న ఆశ్రమం దీనికి వేదికైంది. భగవద్గీత పఠనంతో పాటు కూచిపూడి నృత్యమూ నేర్చుకుంటున్నారు. దాదాపు 60 మంది నిత్యం ఇక్కడకు వస్తున్నారు. దుగ్గిరాల నుంచే కాకుండా మంచికలపూడి నుంచి 12 మంది ఒక ఆటో మాట్లాడుకుని వచ్చి నేర్చుకుంటున్నారు. వీరే కాకుండా ఇంటి దగ్గర ఉండి చదువుకునేలా ఆసక్తి ఉన్న వాళ్లకు శ్లోకాలను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. బాలబాలికలు ఇలా నేర్చుకోవడం చూసి శిక్షణ అనంతరం వారికి అల్పాహారం ఇచ్చేలా దాతలూ సహకరిస్తున్నారు. జాగృత భారత్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి గణేష్, వ్యాసాశ్రమ నిర్వాహకురాలు జంపాల కుసుమకుమారి పర్యవేక్షణలో నిరాటంకంగా తరగతులు జరుగుతున్నాయి. తాటి ధనలక్ష్మి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు.



నృత్య సాధనలో చిన్నారులు

పిల్లల్ని సన్మార్గం వైపు నడిపించడమే ధ్యేయం



పిల్లలు ఎక్కువగా చరవాణికి బానిసలవుతున్నారు. దాని నుంచి కొంత వరకైనా తప్పించడంతో పాటు మన సంస్కృతి, ధర్మం వాళ్లకు తెలియజేయడం ప్రధాన ఆశయం. తద్వారా వీళ్లు మంచి మార్గంలో నడుస్తారనేది మా ఆలోచన. భగవద్గీత, వేమన శతకం, దేవుని పాటలు, ఒక ప్రేరణ ఉపన్యాసం, కూచిపూడి నృత్యం రోజూ నేర్పిస్తున్నాం. ఉపన్యాస కళ ఇప్పుడు చాలా మందిలో ఉండడం లేదు. ఒకవేళ మాట్లాడినా ఒక సబ్జెక్టు మొదలు పెట్టి మరో దానిలోకి వెళ్లిపోతున్నారు. అందుకే ఈ చిన్నారులకు ఉపన్యాసాలు ఎలా చెప్పాలి? అని నేర్పించడమే కాదు.. వాళ్ల చేత మాట్లాడిస్తున్నాం. దుగ్గిరాలలో పిల్లలకు ఆటో కూడా ఏర్పాటు చేశాం.

- పి.గణేష్, జె.కుసుమకుమారి, నిర్వాహకులు



50 శ్లోకాలు నేర్చుకున్నాం

- బి.గౌతమి, కె.తనూజ వెంకటలక్ష్మి, దుగ్గిరాల



గత నెల 25 నుంచి మాకు నేర్పడం మొదలు పెట్టారు. ఇంతవరకు మేము 50 భగవద్గీత శ్లోకాలు నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. సెలవులకు ఊళ్లకు వెళ్లాలని లేదు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు శ్లోకాలు చదువుతున్నాం. ఇంటింటికీ వెళ్లి 100 శ్లోకాలున్న ఉన్న గీత పుస్తకాలను అందజేస్తున్నాం. వీటిని చదవడం వల్ల ఎటువంటి అంశాన్ని ఇచ్చినా తప్పుల్లేకుండా సులభంగా చదవగలుగుతున్నాం.

సంతోషంగా ఉంది : ఎం.హాంసిని, వై.దీనశ్రీ, మంచికలపూడి



భగవద్గీత అంటే ఏంటో మాకు ఇంత వరకు తెలియదు. ఇక్కడకొచ్చి నేర్చుకోవడం వల్ల చాలా సంతోషంగా ఉంది. 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన.. అనే శ్లోకంతో పాటు మరికొన్నింటిని చక్కగా పఠించగలం. వీటి భావం కూడా తెలుసుకున్నాం. శిక్షణ అనంతరం కూడా వీటిని రోజూ సాధన చేస్తాం.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సత్తా



పదిలో ప్రతిభ చూపిన లలిత శరణ్య, నిధి తోష్నివాల్, విజయసారథి

తాడికొండ, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్షా ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పది పరీక్షల్లో గుంటూరు జిల్లాలో తమ విద్యార్థులు ఉత్కృత్తమ మార్కులు పొందారని పేర్కొన్నారు. 12వ తరగతిలో శ్రీసాయిదారహాస్ సనగరం 96.2 శాతం, కొమ్మనబోయిన మహేష్‌కుమార్ 94.2, కౌశిక్ సాయి పబ్బిసెట్టి 91 శాతం మార్కులు సాధించారని తెలిపారు. అలాగే పదిలో చల్లా లలితశరణ్య 98.4, నిధి తోష్నివాల్ 97.4, ఇపూరి విజయసారథి 96.4 శాతం మార్కులు సాధించారని ఆయన తెలిపారు. పాఠశాల ప్రో. వైస్ ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, డైరెక్టర్స్ రాకేష్, ప్రియాంక, అకడమిక్ డైరెక్టర్ ఉషారాణి, ప్రిన్సిపల్ రత్నమాలలు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో కలిసి విజయచిహ్నం చూపుతున్న డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ రథినీ చౌదరి

ప్రోడిజి విద్యాలయ్ విద్యార్థుల జయకేతనం

గుంటూరు విద్య: స్థానిక బుడంపాడు ప్రోడిజి విద్యాలయ్ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జయకేతనం ఎగరవేశారని డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షకు హాజరైన 28 మందిలో వంద శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు. మొదటి స్థానంలో ఎ.రామ్‌చరణ్ 96 శాతం, వై.భవిష్య 95 శాతం, షేక్ హఫీజ్ 94 శాతం మార్కులతో ప్రతిభ చూపారన్నారు. ప్రిన్సిపల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించి వాటిని విద్యకు అన్వయించి బోధన చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. కరస్పాండెంట్ ఎం.సూర్యకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు చురుగ్గా ఏర్పాట్లు



సిద్ధమైన విగ్రహం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: నాగులపాడులో ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ పాల్గొంటారని తెదేపా నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖా మంత్రి అచ్చెన్నాయుడును మంగళవారం విజయవాడలో కలసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్టు తెలిపారు. నాయకులు శ్రీనివాసరావు, వెంకటరావు, నాగబాబు, నాగరాజు, ఏడుకొండలరాజు లున్నారు.



జల్లవాగు అభివృద్ధి ఎప్పుడో?

వట్టిచెరుకూరు చుట్టూ విస్తరించిన జల్లవాగు రెండు కట్టలపై కంప చెట్లు పెరిగి దట్టమైన అడివిని తలపిస్తున్నాయి. దీంతో కట్టలపై రైతుల రాకపోకలకు కష్టంగా మారింది. వరదల సమయంలో గండ్లు పడితే వీటిని పూడ్చడానికి దారి దొరకని దుస్థితి ఏర్పడింది. గత వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా జల్లవాగును అభివృద్ధి చేయలేదు. వాగులో పూడికతీత, కట్టలపై కంప తొలగింపు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఏఈ స్వర్ణలత మాట్లాడుతూ పనులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన తరువాత పనులు చేపడతామని వెల్లడించారు. **- న్యూస్‌టుడే, వట్టిచెరుకూరు**

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

చింతలపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే: గొప్ప ఆలోచన ఉన్నత లక్ష్యాల్ని సాధించేలా చేస్తుందని ప్రేరణోపన్యాసకులు డాక్టర్ పి.శ్రీకాంత్‌బాబు అన్నారు. మంగళవారం చింతలపూడిలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు సృజనాత్మక శక్తి పెంచుకోవాలని శ్రీకాంత్ సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవేంద్రవిష్ణు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, యువజన సర్వీసుల శాఖ జూనియర్ అసిస్టెంట్ ఎన్.శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.

చిన్నారులు వెట్టిచాకిరి బారిన పడకుండా రక్షణ కల్పిద్దాం

తుళ్లూరు, న్యూస్‌టుడే: బాల బాలికలు వెట్టిచాకిరి బారిన పడకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందని గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అత్తోట పోతురాజు తెలిపారు. మంగళవారం దొండపాడు మండల పరిషత్ పాఠశాలలో బాలల రక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. గుడ్‌షెపర్డ్ సంస్థ సభ్యులు నాగమణి, జె.ఇస్రాయేల్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఉండవల్లి కూడలిలో చలివేంద్రం దగ్ధం



తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి కూడలిలో దాతలు తాటాకులతో ఏర్పాటు చేసిన చలివేంద్రానికి మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా దగ్ధమయ్యింది. మద్యం మత్తులో ఎవరైనా ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆ ప్రాంతంలో దాతలు వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వేలాది మందికి దాహార్తి తీరుస్తున్నారు.

అద్దం పగలగొట్టాడని దాడి

పెనందిపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అద్దం పగలగొట్టిన విషయంలో ఇద్దరి మధ్య ఏర్పడిన వాగ్వాదం దాడికి దారితీసింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. పెదనందిపాడు రజక కాలనీలో లక్ష్మి నివాసం ఉంటున్నారు. ఆమె కుమారుడు ఆడుకుంటూ రమేష్ ద్విచక్ర వాహన అద్దం పగలగొట్టాడు. ఈ క్రమంలో ఇద్దరూ రాజీపడి చెరికొంత డబ్బులు వేసుకుని కొత్త అద్దం ఏర్పాటుకు అంగీకరించారు. లక్ష్మికి తెలిసిన చందావలి అనే వ్యక్తి.. మరో ముగ్గుర్ని వెంటపెట్టుకుని వచ్చి ఏంటి డబ్బు అడిగావు అని రమేష్‌పై గొడవకు దిగి గాయపర్చి చంపుతామని బెదిరించాడు. క్షతగాత్రుడు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధూవపన్ మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తాడికొండ, న్యూస్‌టుడే: రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు కథనం మేరకు రేపల్లె నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు చర్లపల్లి వెళుతున్న క్రమంలో మండలంలోని బండారుపల్లి రైలు స్టేషన్ పరిధిలోకి వచ్చింది. ఆ సమయంలో గుర్తుతెలియని వృద్ధుడు అకస్మాత్తుగా రైలు పట్టాలపైకి రాగా.. రైలు ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వయసు 65 నుంచి 70 ఏళ్ల మధ్య ఉండవచ్చు. తెలుపు చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడుఎ. మృతదేహాన్ని పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి తరలించారు. వివరాలు తెలిస్తే జీఆర్పీ రైల్వే ఎస్ఐ ఎం.రోశయ్య, రైటర్ రామరాజులను(నంబర్లు 83093 69916, 99490 63960) సంప్రదించాలని తెలిపారు.

పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి

☛ అడుగంటుతున్న మంచినీటి చెరువులు

☛ కోయవారిపాలెంలో నిలిచిన సరఫరా

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

వంకాయలపాడు మేజరు కాలువ పరిధి గ్రామాల్లో చెరువులు కొన్ని అడుగంటుతుండగా.. కొన్నిచోట్ల ఎండిపోయాయి. ముఖ్యంగా ప్రత్తిపాడులో మంచినీటి చెరువుల్లో నీటిమట్టం బాగా తగ్గిపోతోంది. అడుగున ఉన్న మట్టి నీటిని ప్రస్తుతం ఆయిల్ ఇంజిన్లతో ట్యాంకులకు నింపి సరఫరా చేస్తున్నారు. నాలుగైదు రోజుల్లో ప్రత్తిపాడులో నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితులు కన్పిస్తున్నాయి. కోయవారిపాలెం చెరువులో నీరు లేకపోవడంతో నాలుగు రోజుల కిందటే కుళాయిలకు నీటి సరఫరా నిలిపేశారు. వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు చేరేందుకు మరో నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోపు ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, గ్రామీణ గుంటూరు మండలాల్లో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. వెంటనే సాగర్ జలాలు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోయవారిపాలెంలో..

విడుదల కాని సాగర్ జలాలు

ఏటా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మార్చి, ఏప్రిల్ నెలల్లో చెరువులు నింపేందుకు ప్రత్యేకంగా సాగర్ జలాలు విడుదల చేసేవారు. కానీ ఈ ఏడాది విడుదల చేయలేదు. డిసెంబరులో కురిసిన వర్షాలకు చెరువులు నిండాయి. ఈ నీటినే కుళాయిలకు పంచాయతీ అధికారులు సరఫరా చేస్తూ వచ్చారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు మార్చి నెలాఖరులో వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చెరువులు నింపేందుకు సాగర్ జలాలను విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపారు. కానీ ఇవి ఆచరణకు నోచుకోలేదు.



ప్రత్తిపాడులో మంచినీటి చెరువు


కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

వంకాయలపాడు మేజరు కాలువ పరిధి చెరువుల్లో నీరు లేదని, తాగునీటి సమస్య వచ్చిందని కలెక్టర్ ఎన్.నాగలక్ష్మికి, తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సాగర్ జలాలు విడుదల చేయకపోతే నీటి సమస్యను పరిష్కరించలేమనే విషయాన్ని చెప్పాం. **- వినీల్ కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రత్తిపాడు**

ఎంపీటీసీ సభ్యురాలికి వైకాపా నాయకుల పరామర్శ

తాడికొండ, న్యూస్‌టుడే: వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శివకుమార్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు), అంబటి మురళీ తదితరులు మంగళవారం తాడికొండ మండలం కంతేరులో పర్యటించారు. గ్రామానికి చెందిన ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యురాలు వలపర్ల కల్పనను ఓ విషయంలో కొద్ది రోజుల కిందట పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాయకులు ఆమెతో మాట్లాడి కేసు గురించి ఆరా తీశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

భారత సైనికులకు దైవబలం సమకూరాలి



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

మంగళగిరి, న్యూస్‌టుడే: భారత సైనికులకు దైవబలం సమకూరాలని కోరుతూ మంగళగిరిలోని ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరమరణం పొందిన భారత్ సైనికులకు ఆత్మశాంతి చేకూరాలని మౌలానా మస్తాన్ సాహెబ్ నజ్వి నేతృత్వంలో ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మీర్జా అబిద్ హుస్సేన్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్‌బేగ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి షేక్ నయూబ్‌కమల్, నరసరావుపేట ఇంఛార్జి సయ్యద్ జిలానీ సంయుక్తంగా మీడియాతో మాట్లాడుతూ టెర్రరిస్టులకు ఇస్లాం మతం పేరెత్తే అర్హత లేదన్నారు.

20న సమ్మె జయప్రదం చేయండి



దుగ్గిరాల: మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ, బాలరాజు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న చేపట్టిన సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ముర్తుజానగర్‌లోని షాదీఖానాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జెట్టి బాలరాజు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన, పంచాయతీ కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలని కోరారు. జి.శ్రీనివాసరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, చిరంజీవి, అమ్మిరెడ్డి, శివనాగేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మ, సత్యనారాయణ తదితరులున్నారు.

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఫిరంగిపురంలో మంగళవారం నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికుల సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. కార్మికుల ఉపాధికి భరోసా లేకుండాపోతోందని, 8 గంటల పని అమలు చేయాలని తెలిపారు. సమ్మెకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. మండల ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి, పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు ఇబ్రహీం, వెంకటేశ్వర్లు, శ్రావణ్, హనోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపుపై అభ్యంతరం



పొక్లెయిన్‌కు అడ్డుగా నిలుచున్న తెదేపా నాయకులు, స్థానికులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరులో గుంటూరు రహదారి పక్కన ఏర్పాటు చేసిన షాపులను మంగళవారం సీఆర్డీఏ అధికారులు జేసీబీతో తొలగించే ప్రయత్నం చేయగా కొందరు తెదేపా నాయకులు, స్థానికులు, షాపుల నిర్వాహకులు అడ్డుకున్నారు. రహదారి పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపులు తొలగించి వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయవద్దని నాయకులు కోరారు. ఈ క్రమంలో వారికి, సీఆర్డీఏ అధికారులకు వాగ్వాదం జరిగింది. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయానికి కేటాయించిన స్థలం వద్ద దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కొద్ది రోజుల కిందట ఆలయ కమిటీ నాయకులు సీఆర్డీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీఆర్డీఏ తుళ్లూరు తహసీల్దార్ రవిబాబు, సిబ్బంది పోలీసులతో కలసి షాపులను తొలగించే ప్రయత్నం చేశారు.

తెదేపా గ్రామ కమిటీల ఎన్నిక

తుళ్లూరు, న్యూస్‌టుడే: మండల తెదేపా ఆధ్వర్యంలో గ్రామ కమిటీల ఎన్నికల కొనసాగుతోంది. మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు ధనేకుల వెంకటసుబ్బారావు, దామినేని శ్రీనివాసరావు, బెల్లంకొండ నరసింహారావు, పుట్టి రామచంద్రరావు, తెదేపా నాయకులు పర్యవేక్షించారు. వెంకటపాలెంకు జమ్ముల శ్రీనివాసరావు, ఉద్దండరాయునిపాలెంకు బత్తుల కోటేశ్వరావు, రాయపూడికి మూల్పూరి శ్రీనివాసరావు, అబ్బరాజుపాలెంకు భోగినేని సుధీర్, బోరుపాలెంకు కట్టా నరసింహారావు, హరిశ్చంద్రపురానికి కొమ్మినేని కోటేశ్వరావు, లింగాయపాలెంకు అనుమోలు సత్యనారాయణ, వడ్డమానుకు పుచ్చకాయల సాంబశివరావులు గ్రామ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

జేసీబీ, టిప్పర్ల స్వాధీనం

మేడికొండూరు: ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో అక్రమంగా మట్టి తీస్తున్నారని ఓ జేసీబీ, రెండు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పేరేచర్ల శివారు కైలాస గిరిక్షేత్ర సమీప ప్రభుత్వ స్థలంలో అక్రమంగా మట్టి తవ్వుతున్నారని అధికారులకు సమాచారం అందగా వారు పరిశీలించగా అనుమతులు లేవని తేలింది. గ్రామ రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



కనుల పండువగా వసంతోత్సవం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: బుర్రిపాలెంలోని శ్రీ భూదేవి సమేత లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవం వైభవంగా కొనసాగుతోంది. మంగళవారం వసంతోత్సవం కనుల పండువగా జరిగింది. వ్యవస్థాపక ధర్మకర్త నర్రావుల వెంకటేశ్వరరావు వేడుకలను పర్యవేక్షించారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

నేడు కొలకలూరులో ఉచిత వైద్య శిబిరం

తెనాలి టౌన్: మండలంలోని కొలకలూరులో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, దుగ్గిరాల ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహక ప్రతినిధులు మంగళవారం తెలిపారు. స్థానిక జూబ్లీ స్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య నిపుణులు సేవలు అందిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం: 6,100
అత్యల్పం: 4,000
సగటు: 5,200

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి కొత్తపేట దావులూరి వారి రోడ్డులో తరచూ వీధి దీపాలు వెలగడం లేదు. -శ్రీనివాసరావు

✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం.

? తెనాలి కూరగాయల మార్కెట్ ప్రాంతం నుంచి జెండా చెట్టు రోడ్డుకు దారి తీసే మార్గంలో మురుగు కాలువలు చెత్తతో పూర్తిగా పూడిపోయాయి. - భాస్కర్, మార్కెట్ ఏరియా

✔ వ్యర్థాలను తొలగింపచేస్తాం. (ప్రశ్నలకు పురపాలక కమిషనర్ బి.శేషన్న సమాధానాలు ఇచ్చారు) - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు క్యాబిన్‌పేట శివారులో వీధి దీపం వెలగడం లేదు. రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. -పి.నవీన్‌కుమార్, క్యాబిన్‌పేట

✔ వీధి దీపం బాగు చేయిస్తాం. -జంగం అవర్ల, సహాయ ఇంజినీరు

? పొన్నూరు శాంతినగర్‌లోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. కాలువను శుభ్రం చేయాలి. -ఎన్.డేవిడ్, శాంతినగర్

✔ వ్యర్థాలు తొలగిస్తాం. - శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

-న్యూస్‌టుడే, పొన్నూరు

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పాత పొన్నూరులో పేరుకుపోయిన చెత్త తొలగించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

బరువులెత్తేందుకు ఉత్సాహం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

తెనాలి చెంచుపేట ఉడా కాలనీలోని క్రీడా మైదానంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ ఇస్తున్నారు. సాధారణ రోజుల్లోనూ ఈ సౌకర్యం అందుబాటులో ఉంటున్నప్పటికీ వేసవి సెలవులు సద్వినియోగం కోసం అదనంగా ఈ నెల 1న ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జూన్ 15వ తేదీ వరకు శిబిరం కొనసాగే అవకాశం ఉందని గురువు గోపీనాథ్ వివరించారు. శిబిరంలో ప్రస్తుతం సుమారు 30 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న 11 సంవత్సరాలు నిండిన బాలబాలికలు శిక్షణకు రావచ్చునని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువు గోపీనాథ్ కోరారు.

వేసవి శిబిరంలో ఉచితంగా వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో గురువు గోపీనాథ్


సెలవులు సద్వినియోగం



ఏడాది నుంచి వెయిట్ లిఫ్టింగ్ సాధన చేస్తున్నా. గత ఏడాది నవంబరులో మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి, డిసెంబరులో తెనాలిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాలు సాధించా. ఇప్పుడు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ రానున్న పోటీలకు సిద్ధమవుతున్నా.

– ఎం.సాయికిరణ్, ఇంటర్ విద్యార్థి

జాతీయ పోటీలకు సన్నద్ధమవుతున్నా



గత ఏడాది నవంబరులో జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించా. ఏడాది నుంచి సాధన చేస్తున్నాను. రానున్న జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమవడానికి వేసవి సెలవులు ఉపయోగపడుతున్నాయి.

– షేక్.నూరుద్దీన్, బీటెక్ విద్యార్థి

క్రమం తప్పకుండా శిక్షణకు హాజరు



వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తితో ఎనిమిది నెలలుగా సాధన చేస్తున్నా. తక్కెళ్లపాడులో గత ఏడాది అక్టోబరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించా. మరింత పట్టు సాధించడానికి ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా శిక్షణకు హాజరవుతున్నా.

– ఆర్.రాము, ఇంటర్ విద్యార్థి

వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: వీరాంజనేయ స్వామి దేవస్థానం ట్రస్టు, కార్తిక్ శారి మందిర్ సంయుక్తంగా మంగళవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కొలిపాకుల శ్రీమన్నారాయణ, కడియాల శ్రీనివాసరావు, పెండేల పూర్ణ, రమావత్ బాబూ నాయక్, ఆలపాటి శివ, గుర్రం సీతారామయ్య, కొప్పురావూరు కిషోర్, మురళీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

సమర్థంగా చెత్త పునర్వినియోగం పనులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ 2.0లో దశలవారీ చెత్త రూపు మాపు ప్రక్రియ అమలు చేయకుంటే ఇంకెప్పుడూ చేయలేమని ఐటీసీ డిప్యూటీ మేనేజర్ ఉమాకాంత్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై వ్యాపారులు, ఎన్జీవోలకు అవగాహన కార్యక్రమం మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో కమిషనర్ శేషన్న అధ్యక్షత నిర్వహించారు. కావాల్సిన యంత్ర పరికరాలు, సామగ్రి ఉంటేనే చెత్త సేకరణ నుంచి రీ సైక్లింగ్ చేయడం సాధ్యమని ఉమాకాంత్ పేర్కొన్నారు. 2007లో చెత్త నిర్వహణపై కమిషనర్లను సంప్రదించగా ఆసక్తి చూపలేదని, ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్‌ను ఏర్పాటు చేశాక కమిషనర్లు చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారని ఆయన వివరించారు. ఐటీసీ ఆధ్వర్యంలో 42 మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ నుంచి రీ సైక్లింగ్ పనులు సమర్థంగా నిర్వహిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ బిట్ ది హీట్ నినాదంతో ఈ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, సహాయ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి కె.హెచ్.నిర్మల మాట్లాడారు.



మాట్లాడుతున్న ఐటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమాకాంత్, వేదికపై సబ్‌కలెక్టర్ సంజనా సింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ శేషన్న తదితరులు

మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి బోస్‌రోడ్డులోని ఐఎంఏ భవనం చెంతనే మూత లేని మ్యాన్ హోల్‌లో జనం పడుతున్న సమస్యను ఈ నెల 7న 'అదుపు తప్పితే అంతే' శీర్షికలో ఈనాడులో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్‌పై ఇనుప మూత ఏర్పాటు చేయించి ప్రమాదాలను నివారించారు.

ఫోన్ వినియోగంలోకి వచ్చింది

తెనాలి టౌన్: 'పనిచేయని అగ్నిమాపక కేంద్ర ఫోన్ నంబరు' శీర్షికన ఈ నెల 13న ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు పూర్తి చేయడంతో ఫోన్ తిరిగి వినియోగంలోకి వచ్చింది.

పొట్టి శ్రీరాములు పార్కు అభివృద్ధికి కృషి

తెనాలి (కొత్తపేట): నిరుపయోగంగా మారిన పొట్టి శ్రీరాములు పార్కు, అనంతరం అంబేడ్కర్ భవనం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురానున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని 1,7,8,9,10,39 వార్డుల్లో పర్యటించారు. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు, బహిరంగ వ్యాయామం పరికరాలు పార్కులో ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ప్రధాన మున్సిపల్ కాలువలో పూడిక తీత పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. వార్డు కౌన్సిలర్ సురేంద్ర, నాయకుడు హరీష్, ఏఈ సూరిబాబు, బాషా, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

20 లోపు అన్నదాత సుఖీభవకు పేర్లు నమోదు

పెదకాకాని: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో సంధ్యారాణి తెలిపారు. పొలం పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులు తీసుకొని ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె చెప్పారు.



తాగునీరు వృథా

పట్టణ గంగానమ్మపేట గుర్రం వారి వీధి ఎదురు సందులో కుళాయిల పైపుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. వీటికి ట్యాపులు బిగించి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)**

గుడివాడ చిచ్చరపిడుగుకు మరో పురస్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని గుడివాడకు చెందిన బాలమేధావి బండికళ్ల ప్రదీప్‌నారాయణ్ ప్రెస్‌క్లబ్ వెల్‌ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ - న్యూదిల్లీ నుంచి ఇంటర్నేషనల్ బెస్ట్ ఎచీవర్ అవార్డు అందుకున్నట్లు తండ్రి రాజేష్ మంగళవారం తెలిపారు. 1 సంవత్సరం 11 నెలల వయస్సులోనే 150కు పైగా వస్తువులను గుర్తించి వాటి పేర్లను స్పష్టంగా చెప్పి బాల మేధావిగా గుర్తింపు పొందిన ప్రదీప్‌నారాయణ్ అటుపై తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతున్నాడు. కొద్ది రోజుల కిందటే 5వ ఏట అడుగు పెట్టిన ఈ చిచ్చరపిడుగు ఇప్పటి వరకు 11 అంతర్జాతీయ, 10 జాతీయ పురస్కారాలను అందుకున్నాడు.



ప్రదీప్‌నారాయణ్

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు పేర్కొన్నారు. మండలంలోని దొప్పలపూడిలో మంగళవారం వ్యవసాయ యంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రాయితీపై పరికరాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా హయాంలో వ్యవసాయ యంత్రీకరణ పరికరాలను వైకాపా నేతలకు అందజేసి రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. అనంతరం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ వి.రామకోటేశ్వరి, కూటమి నాయకులు మదాల వెంకటేశ్వర్లు, బండ్లమూడి బాబురావు, గనిపిశెట్టి రామకృష్ణ ,సౌపాటి వెంకట్రావు, ఏవో డేగల వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.



రైతుకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న నాయకులు, అధికారులు

విజేతలకు బహుమతులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి క్రీడా మైదానంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. గురువు వినయ్‌కుమార్, రవిశంకర్, సాయిలలిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తెనాలి టౌన్: ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థులు తెనాలి మండలం కఠెవరంలో మంగళవారం పర్యటించి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించారు. జీవామృతం తయారీని వివరించారు.

సమస్యలతో సహవాసం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

తెనాలి నందులపేట, గాంధీనగర్‌లోని రెండు (5,6) వార్డుల్లో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ వార్డుల్లో 9 వేల మంది నివసిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని సమస్యలను కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు ఇతర వార్డుల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులతో పని చేయిస్తున్నారు. ఆ తరవాత అరకొర కార్మికులతో పనులు చేయించడం షరా మామూలైంది. మురుగు పారుదల లేకపోవడంతో దోమకాటుతో అల్లాడుతున్నట్లు జనం వాపోతున్నారు.



★ **నందులపేట కవిరాజాపార్కు వెనుక** సిమెంటు రోడ్డు సగం వరకు వేసి వదిలేశారు. మిగిలిన సగం వేయించాలని కోరగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ఆ పార్కు ఎదురు కొత్త రోడ్డు వేయడానికి టెండర్ పిలిచి గుత్తేదారును ఖరారు చేశారు. పనులు మొదలు పెట్టించాలని స్థానికులు కోరుతున్నారు.



★ **వినాయక గుడి వీధి** బాపూజీ భవన్ ఎదురు సందులో మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తోంది.



★ **కవిరాజా పార్కులో** మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంతో సందర్శకులకు ఆహ్లాదం కరవైంది. వీటిని త్వరిత గతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

★ ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించడం లేదు. పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయి. అనధికార అంతస్తులకు పట్టణ ప్రణాళికా సిబ్బంది రంధ్రాలు పెట్టించి సరిపుచ్చారు. యజమానులు వాటిని పూడ్చి అమ్మకాలు జరుపుతున్నారు. సదరు యజమానులకు నోటీసులు ఇచ్చామని, ఛార్జిషీట్ వేస్తామని పట్టణ ప్రణాళికా అధికారులు పేర్కొన్నారు.

★ అల్పాహార శాలల వారు రోడ్డు ఆక్రమించి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు, నిర్మాణ సామగ్రి రోడ్లపైన పడేయడం సాధారణమైంది. వీటిని తొలగించాలని కోరినా సిబ్బంది జాప్యం చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కలతో జనం బెంబేలెత్తి పోతున్నారు.

వైభవంగా చక్రస్నానం



పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చక్రస్నానాన్ని వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

20 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని సహస్రలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి గద్దె అమరనాథ్ మంగళవారం వెల్లడించారు. ఈ నెల 20న స్వామి వారి తిరుమంజనం, అంకురారోపణ, 21న లక్ష తమలపాకు పూజ, గ్రామోత్సవం, 22న లక్ష తమలపాకు, మల్లెపూలతో పూజ, వీరాంజనేయ స్వామి కల్యాణం, 23న దివ్య రథోత్సవం జరుగుతుందని ఆయన చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి

పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ నాజర్‌పేటలోని పాండురంగ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అన్నదానం చేశారు.

20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొనాలని సీఐటీయూ నాయకులు కొల్లిపర బాబూ ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి కోరారు. వీరు మంగళవారం చెంచుపేట పరుచూరి నాగేశ్వరరావు భవనంలో విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే సమ్మె చేస్తున్నట్లు యాజమాన్యాలకు నోటీసులు అందజేసినట్లు వారు వివరించారు. బ్రిటీష్ కాలంలో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఆయన మంగళవారం గుడివాడలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన భైరపనేని నరసింహారావు, ఆయన కుమారులు సీతారామయ్య, మల్లికార్జునరావు రూ.లక్ష విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి వేద పండితుల ఆశీర్వచనంతో సత్కరించారు.



దాతలను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

వివాదాస్పద భూమి పరిశీలన

చేబ్రోలు, న్యూస్‌టుడే: పంట పొలాలు, ఇంజనీరింగ్ కళాశాల మధ్య ఉన్న డొంక పోరంబోకు స్థలాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సాయికుమార్ పరిశీలించారు. చేబ్రోలు శివారులోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాల పక్కగా రైతులు పొలాలు వెళ్లేందుకు, వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకునేందుకు డొంక పోరంబోకు స్థలం ఉండగా అందులో కళాశాల యాజమాన్యం మురుగు పోయే కాలువను ఏర్పాటు చేస్తోంది. ఇటీవల రైతులే స్వచ్ఛందగా డొంకలోని చెట్లను తొలగించి శుభ్రం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మురుగు కాలువ డొంకలో ఉండటంతో దానిని కూడా తొలగించారు. దీంతో కళాశాల యాజమాన్యం మురుగు పోయేందుకు మార్గం చూపాలని అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వివాదాస్పద భూమిని డీపీవో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఇంకుడు గుంతను, మురుగు నీటిని శుద్ధి చేసి ఇతర అవసరాలకు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. పొలాలు ఉన్న రైతులను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని తెనాలి డీఎల్‌పీవో స్వరూపారాణిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక ఇస్లాంపేట నివాసి, కార్పెంటర్ షేక్ మీరావలి (45) ఈ నెల 11న అర్ధరాత్రి గుంటూరు నుంచి తెనాలి వస్తూ మార్గమధ్యలో అంగలకుదురు వద్ద వాహనం అదుపు తప్పటంతో తలకు తీవ్ర గాయమయ్యింది. తొలుత తెనాలి, అటుపై గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. వాహనం నుంచి కింద పడినప్పుడు తలకు గాయం కావడం వల్ల ఇలా జరిగిందని, హెల్మెట్ ధరించి ఉంటే తలకు గాయం అయ్యేది కాదని పోలీసులు వివరించారు.

యువకుల ఘర్షణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కొద్ది రోజుల కిందట నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో వాహనాల సైలెన్సర్లు తీసివేసి శబ్దం చేసిన విషయంలో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడిన ఘటన కొలకలూరులో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వసతుల్లేక తిప్పలు

పేరుకే పుణ్యక్షేత్రాల గ్రామం

పెదకాకాని, న్యూస్‌టుడే

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మల్లేశ్వరస్వామి దేవస్థానం, హజరత్ సయ్యద్ బాజి షహీద్ అవులియా దర్గా, బైబిలు మిషను (స్వస్తిశాల) వంటి మూడు పుణ్యక్షేత్రాలు పెదకాకానిలో ఉన్నాయి. సర్వమత సమ్మేళనానికి నిదర్శనమైన ఈ గ్రామానికి నిత్యం వందల సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకొని వెళుతుంటారు. ముఖ్యంగా శుక్ర, శని, ఆది, సోమవారాల్లో ఇక్కడికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కొందరు సొంత వాహనాలు, మరి కొందరు ఆర్టీసీ బస్సులు, ప్యాసింజర్ ఆటోల ద్వారా పెదకాకానికి రాకపోకలు సాగిస్తున్నారు.

కాలకృత్యాలకూ కష్టాలే.. : ఆర్టీసీ బస్సులు, కార్లు, ప్యాసింజర్ ఆటోల్లో ఎక్కువ మంది భక్తులు పెదకాకానికి వచ్చి మొక్కులు తీర్చుకొని వెళుతుంటారు. స్థానిక సెంటర్లో దిగి ఆయా పుణ్యక్షేత్రాలకు ఆటోల ద్వారా చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో సెంటర్లో ఆర్టీసీ, ఆటోల కోసం ఎదురు చూస్తున్న భక్తులు కాలకృత్యాలకు వెళ్లాల్సి వచ్చిన సమయంలో దగ్గరలో మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటో మాట్లాడుకొని మళ్లీ ఆయా పుణ్యక్షేత్రాలకు వెళ్లి పని ముగించుకొని వచ్చే పరిస్థితి ఏర్పడింది. సెంటర్లో మరుగు దొడ్లు నిర్మించాలని కొందరు భక్తులు కోరుతున్నారు.

నిలువు నీడలేదు: సెంటర్లో బస్‌షెల్టర్ లేకపోవడంతో భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం తాత్కాలిక బస్‌షెల్టర్ అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పెదకాకాని సెంటర్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న భక్తులు

భక్తులు ఇబ్బంది పడుతున్నారు



గ్రామంలో 30వేల జనాభా ఉన్నారు. ఇక్కడకు వచ్చే భక్తుల ద్వారా ప్రభుత్వానికి ప్రత్యక్ష, పరోక్ష రూపంలో ఏటా రూ.కోట్లలో ఆదాయం చేకూరుతోంది. కనీస వసతులైన బస్ షెల్టర్, మరుగుదొడ్లు లేవు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలు ఉన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలి.

- ఆత్మకూరి వెంకటేశ్వర్లు, శివాలయం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు

గుంటూరు తూర్పు

నేపాల్‌దేవ్ భట్టాచార్య మృతి తీరనిలోటు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ నేపాల్‌దేవ్ భట్టాచార్య మృతి రవాణా రంగ కార్మికులకు తీరనిలోటు అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివాజీ అన్నారు. మంగళవారం గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో నేపాల్‌దేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. గంగాధరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణరావు, లక్ష్మీనారాయణ, రాంప్రసాద్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాట 14, వంగ 16, బెండ 20, పచ్చిమిర్చి 25, కాకర 34, క్యారెట్ 27, క్యాబేజీ 17, బీర 20, దొండ 18, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 18, గోరుచిక్కుళ్లు 30, దోస 18, పొట్ల 22, పెద్ద చిక్కుళ్లు 50, చామదుంప 44, మునగ 7, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 25, బీట్‌రూట్ 28, కీర 39, క్యాప్సికం 55, అల్లం 40, ఫ్రెంచి బీన్స్ 80, సొర 14, అరటి 7.
- న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

- సీతానగరం రెండోలైన్‌లో చెత్తకుప్పలు తీయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు బాబురావు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో ఆయన స్పందించి సిబ్బందితో చెత్తకుప్పలు తీయించి తరలించారు.
- వెంగళరావునగర్ మూడో లైన్ కాల్వలో వారం రోజులుగా పూడికలు తీయకపోవడంతో మురుగుపారుదలకు ఆటంకం ఏర్పడిందని స్థానికులు శానిటరీ సూపర్‌వైజర్ ఐజాక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సిబ్బందితో కాల్వల్లో పూడికలు తీయించారు.
- నందివెలుగురోడ్డు గాంధీబొమ్మ సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనులు చేసి మట్టికుప్పలు తొలగించలేదు. దీంతో ఇబ్బంది పడుతున్నామని మేమున్నాం..మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించి మట్టికుప్పలు తొలగించారు.
- లాలాపేట మసీదు సెంటర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలుపగా వారు స్పందించి వ్యర్థాలు తొలగించారు.

- న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ (గుంటూరు), పట్నంబజారు



? కొత్తపేట గణేష్‌రావు వీధిలో కాల్వల్లో సిల్ట్ తీసి కుప్పలు అలాగే వదిలేశారు.
- స్థానికులు

✔ చెత్తకుప్పలు తీయించేందుకు చర్యలు తీసుకుంటాం.
- శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్
- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ (గుంటూరు)

ప్రయోగాత్మకంగా ఘన వ్యర్థాల నిర్వహణ


ఇంటింటి చెత్త సేకరించి తరలిస్తున్న కార్మికులు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు అనేక పనులు అమలు చేస్తున్నారు. స్వచ్ఛత ఆవశ్యకత గురించి క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తెలియజేసి ప్రజా భాగస్వామ్యంతో పక్కాగా పారిశుద్ధ్యం అమలు చేసేలా నూతన విధానాన్ని తీసుకురానున్నారు. దీనిలో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని ఐదు డివిజన్లను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని ఆయా ప్రాంతాల్లో స్వయం సహాయ సంఘాలు (డ్వాక్రా) గ్రూపు మహిళలకు బాధ్యతలు అప్పగించనున్నారు. నిబంధనల మేరకు ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, తరలింపు, రహదారులు, సైడు కాలువల శుభ్రం, ఫాగింగ్ వంటివి అమలు చేసి ఘన వ్యర్థాల నిర్వహణలో మిగిలిన డివిజన్లకు ఆదర్శంగా నిలిచేలా చూడనున్నారు. ఇందుకు ప్రజారోగ్య విభాగం నుంచి సహకారం అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. త్వరలోనే ఆయా డివిజన్లలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నూతన విధానాన్ని అమలులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన డివిజన్లు, ప్రాంతాలు..

- ✤ తూర్పు నియోజకవర్గంలో 9వ డివిజన్ బీఆర్ స్టేడియం, పాతగుంటూరు యాదవబజారు, 12వ డివిజన్ సంగడిగుంట
- ✤ పశ్చిమం.. 21వ డివిజన్ కేవీపీ కాలనీ, కృష్ణబాబు కాలనీ, 22వ డివిజన్ శ్రీనివాసరావుతోట
- ✤ ప్రత్తిపాడు.. 46వ డివిజన్ సీతారామ్‌నగర్, బాలాజీనగర్, హనుమాన్‌నగర్, శ్రీరాంనగర్, అన్నపూర్ణనగర్, గోరంట్ల, ఆఫీసర్స్ కాలనీ.

విజయవంతమైతే మరిన్ని ప్రాంతాలకు విస్తరణ..

స్వయం సహాయక సంఘాలతో కలిసి నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛత కార్యక్రమం విజయవంతమైతే నగరంలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛత కార్యక్రమంతోపాటు తడి చెత్తను కంపోస్ట్ తయారు చేయడం, క్లస్టర్ కంపోస్ట్ విధానాలు అమలు చేస్తే ఉపయోగం ఉంటుంది. కంపోస్ట్ తయారీతోపాటు ఆయా డివిజన్లలో మిద్దె, పెరటి తోటల పెంపకంపై కూడా ఇంటింటికీ అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. కంపోస్ట్ తయారీ, మిద్దె, పెరటి తోటల పెంపకానికి ఏళ్లుగా జీఎంసీ పరిధిలో కృషి చేస్తున్న ఐటీసీ ఫినిష్ సంస్థ, బంగారు భవిష్యత్తు ప్రాజెక్టు ప్రతినిధులనూ ఈ కార్యక్రమం పరిధిలోకి తీసుకొస్తే ఫలితాలు మరింత మెరుగ్గా వచ్చే అవకాశం ఉంటుంది..

రవాణా రంగం ప్రైవేటీకరణ యత్నం తగదు


ఐక్యత చాటుతున్న ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రవాణా రంగం మొత్తం ప్రైవేటీకరణ చేయటానికి సిద్ధమవ్వడం అత్యంత దుర్మార్గమని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ అన్నారు. గుంటూరులోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జాతీయ రహదారులపై టోల్‌గేట్లు అమలు జరుగుతున్నాయని ఇక నుంచి రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్లు పెడుతున్నామని చెప్పడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రోడ్ల డిజైన్లు మార్పు చేసి పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రవాణారంగ కార్మికుల సమస్యల కోసం మే 20న జరిగే సమ్మెలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆటోలు బంద్ చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రాంప్రసాద్, పవన్, లక్ష్మణరావు, మస్తాన్‌వలి, శ్రీనివాసరావు, శంకర్, మురళి, రాంబాబు, రాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరులోని కార్యాలయంలో నిర్వహించిన పంచాయితీ కార్మిక సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ మే 20న జరిగే సమ్మెలో పంచాయితీ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు వీరయ్య, సంధ్య, దుర్గ, వెంకటేశ్వరమ్మ, సుభాష్‌చంద్రబోసు, వేణు పాల్గొన్నారు.

బియ్యం వ్యాపారులు నిబంధనలు పాటించాల్సిందే


మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మాధురి

పట్నంబజారు, న్యూస్‌టుడే: బియ్యం వ్యాపారులు కాటాలను ఏడాదికి ఒక్కసారి తూనికలు, కొలతలశాఖ అధికారులతో సర్టిఫై చేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మాధురి అన్నారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కంకరగుంట సమీపంలోని మోడరన్ రైస్‌మిల్లులో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైస్ మిల్లర్లు ప్రతి బియ్యం బస్తాపై విధిగా ప్యాకేజీ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ శ్యాలేమ్‌రాజు మాట్లాడుతూ బియ్యం వ్యాపారులు ఎప్పటికప్పుడు కాటా రాళ్లను పరిశీలించుకొని తూకం వేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

☛ అనంతరం ఏటుకూరురోడ్డులోని ది గుంటూరు కిరాణా రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఫ్యాన్సీ, కిరాణా వ్యాపారులు విధిగా ప్యాకేజీ నిబంధనలు పాటించాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోలేపల్లి గణేష్, పువ్వాడ వెంకట నారాయణ, కాకర్ల హనుమంతరావు, చెక్కా రాము తదితరులు పాల్గొన్నారు.

పనుల పూర్తికి చర్యలు: మేయర్


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, పక్కన కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ (గుంటూరు): నగరంలో ప్రాధాన్యత ఉన్న అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. మంగళవారం ఆయన కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి ఏటి. అగ్రహారం ప్రధాన రహదారి, చుట్టుగుంట చెరువు అభివృద్ధి పనులు పరిశీలించి ఆదేశాలు ఇచ్చారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ చుట్టుగుంట చెరువు, వాకింగ్ ట్రాక్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం జరగాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విస్తరణకు అంగీకారం తెలిపిన భవనాలను తొలగించడం, డ్రెయిన్, సెంట్రల్ డివైడర్ నిర్మాణానికి మార్కింగ్ ప్రణాళికాధికారులు పూర్తి చేయాలని చెప్పారు. కంకరగుంట ఆర్‌యూబీ దగ్గర చేపట్టిన విస్తరణ పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. విస్తరణకు ప్రభావితమైన భవనాలకు నష్టపరిహారం, స్థలాలకు టీడీఆర్ బాండ్లను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్‌కుమార్, డీఈఈ మధు పాల్గొన్నారు.

దేవాలయాల్లో క్షురకుల వేతనం పెంపు హర్షణీయం

పట్నంబజారు, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా క్షవర వృత్తిదారులకు ఆధునిక సెలూన్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.10 లక్షలు రుణాలు అందించాలని ఏపీ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు అన్నారు. నాజ్‌సెంటర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా క్షవర వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న నాయీ బ్రాహ్మణులు ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని ఆయన కోరారు. దేవాలయాల్లో పనిచేసే క్షురకులకు కూటమి ప్రభుత్వం రూ.25వేలు వేతనాన్ని పెంచడం హర్షణీయమన్నారు. టి.హరినాథ్‌బాబు, జి.భాస్కర్, పి.శ్రీమన్నారాయణ, ఎన్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే చర్యలు

పట్నంబజారు: డ్రైవింగ్ లైసెన్సు లేకుండా రోడ్లపై వాహనాలు నడపరాదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు అన్నారు. ఆర్టీసీ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నారాకోడూరురోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాల్ని నిలుపుదల చేసి వాటి యాజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల్, ఆర్టీసీ గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం, తెనాలి డిపో మేనేజర్ ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ జి.సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఆచార్య శ్రీదేవి

గుంటూరు వైద్యం: గుంటూరు వైద్య కళాశాల ఔషధశాస్త్ర విభాగంలో ఆచార్య శ్రీదేవి విధుల్లో చేరారు. పాడేరు వైద్య కళాశాలలో పని చేస్తున్న ఆమెను గుంటూరుకు బదిలీ చేశారు.

మంచి భవిష్యత్తుంది.. కష్టపడి పని చేయండి


చంద్రబాబుతో రాయపాటి శైలజ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'మీకు మంచి భవిష్యత్తు ఉంటుంది. కష్టపడి పని చేయండి'.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన డాక్టర్ రాయపాటి శైలజను అభినందించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబును ఆమె మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజధాని అమరావతి ఉద్యమంలో ఏవిధంగా అయితే కష్టపడి పని చేశారో.. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా కూడా అదేవిధంగా సేవలు అందించాలని సూచించారు. శైలజ స్పందిస్తూ తనపై నమ్మకం ఉంచి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు.

సీబీఎస్ఈలో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య: సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుతమ ప్రతిభ కనబరిచారని ఎల్ఐసీ కాలనీ విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థి సంపత్‌రెడ్డి 483 మార్కులు సాధించగా హనీష్ 477 మార్కులు సాధించారన్నారు. పాఠశాలలో 450 మార్కులకుపైగా 10 మంది, 400 మార్కులుపైగా 40 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, వైస్‌ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, జోనల్ ఇన్‌ఛార్జి అనురాధ, ఉపాధ్యాయులు అభినందించారు.

క్యూరింగ్ చేయకపోతే ఎలా?


సిమెంట్ రోడ్డుకు కట్టలు వేసి నీళ్లు పెట్టకుండా వదిలేశారిలా..

రత్నగిరినగర్ శ్రీకృష్ణుడి విగ్రహం రహదారిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేశారు. కనీసం కొన్ని రోజులైనా నీటితో క్యూరింగ్ చేయాల్సిన అవసరముంది. ఇక్కడ రహదారికి కట్టలు ఏర్పాటు చేసినా క్యూరింగ్ చేయడంలేదు. ఓవైపు ఎండలు మండిపోతున్నాయి. క్యూరింగ్ చేయకుండా ఆవిధంగా వదిలేస్తే సిమెంట్ రోడ్డు మన్నిక ఎన్నాళ్లు ఉంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే గుత్తేదారు ఈవిధంగా వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. సిమెంట్ రోడ్డు క్యూరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పట్టాభిపురం.

ప్రధాన డ్రెయిన్ పరిశీలన

నగరపాలకసంస్థ: పాతగుంటూరులోని మొండిగేటు వద్ద నుంచి జాతీయ రహదారి వైపు ఉన్న ప్రధాన డ్రెయిన్ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి పాతగుంటూరు, బాలాజీనగర్, వెహికల్ షెడ్ ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ మొండి గేటు వద్ద డ్రెయిన్ ఆక్రమణలకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. సర్వే చేసి అనధికార కల్వర్టులను తొలగించాలన్నారు. బాలాజీనగర్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం కాల్వల శుభ్రతకు దృష్టి సారించాలని చెప్పారు. పర్యటనలో ఈఈ సుందరామిరెడ్డి, డీఈఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి బిల్డర్ల సహకారం అవసరం


మేయర్‌ను సత్కరిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరాభివృద్ధిలో బిల్డర్స్ భాగస్వాములు కావాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం పలకలూరురోడ్డులోని గుంటూరు క్లబ్‌లో నెరెడ్కో బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో అంతర్భాగంగా ఉన్న గుంటూరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బిల్డర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎంసీ అనుమతించిన ప్లాను ప్రకారం, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. నెరెడ్కో అధ్యక్షుడు పెరవల్లి నాగవంశీ, కార్యదర్శి శ్రీనాథ్, కోశాధికారి అర్జున్‌సాయి, సలహా కమిటీ ఛైర్మన్ గద్దె తిరుపతిరావు పాల్గొన్నారు.

20న సివిల్ సప్లయీస్ కార్మికులు సమ్మె

గుంటూరు నేరవార్తలు: మే 20వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లాల సివిల్ సప్లయీస్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని ఏపీ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ముఠా కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు తెలిపారు. ఈమేరకు మంగళవారం పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ లక్ష్మిని తన కార్యాలయంలో కలసి సమ్మె నోటీసులు అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మరియదాసు నాయకులు నాగరాజు, కోటేష్ పాల్గొన్నారు.

ఏ కార్యకలాపాలైనా కంట్రోలర్‌కు తెలియజేయాల్సిందే!

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్ర ఎవాంజెలికల్ లూథరన్ సంఘం(ఏఈఎల్‌సీ) పరిధిలో ఏ కార్యకలాపాలైనా పరిపాలనా బాధ్యతల్లో ఉన్న కంట్రోలర్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసఫ్‌కు తెలియజేయాల్సిందేనని పరిపాలనా నిర్వాహకులుగా ఉన్న కేరళ విశ్రాంత సబ్ జడ్జి జోసఫ్ పీఎస్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఏపీ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 25.04.25 నుంచి కంట్రోలర్‌గా జస్టిస్ కురియన్ జోసఫ్ ఉన్నారని తెలిపారు. ఏఈఎల్‌సీ సంఘానికి సంబంధించి పరిపాలనా విషయాలు ఉంటే కంట్రోలర్‌కు గాని, పరిపాలనా నిర్వాహకునికి గాని, కంట్రోలర్ కార్యదర్శి, ఏపీ విశ్రాంత జూనియర్ జడ్జి నేలటూరి జేసురత్న కుమార్‌కు గాని తెలియజేయాలని పేర్కొన్నారు. ఏఈఎల్‌సీ పరిధిలోని వ్యక్తులు, గ్రూపులు, సంఘాల్లో ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికలు, ఇతర ఏ స్థాయి ఎన్నికలు జరపకూడదన్నారు. కంట్రోలర్ ఉత్తర్వులను అనుసరించి మాత్రమే ఎన్నికల నిర్వహించుకునే వీలు ఉంటుందని తెలిపారు. ఏ వ్యక్తులు అయినా కంట్రోలర్ ఉత్తర్వులు, నియమాలను, హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకపోతే తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ అరవింద్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: రౌడీషీటర్ల నివాసాలను మంగళవారం ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మికంగా పరిశీలించారు. మల్లికార్జునపేట నుంచి శారదాకాలనీ 21వ వీధి వరకు ఎస్పీ కాలినడకన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని పాత నేరస్థులు, రౌడీషీటర్లు ఇళ్లకు వెళ్లారు. ఇళ్ల వద్ద ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్టులతో మాట్లాడి వారి కార్యకలాపాలపై ఆరా తీశారు. భవిష్యత్తు ఎటువంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. పశ్చిమ డీఎస్పీ అరవింద్, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాసరావు, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, ఎస్సైలు కృష్ణబాలాజీ, ప్రసన్నకుమార్, ఆంజనేయులు, రోజాలత ఉన్నారు.

కరెంటు హెచ్చుతగ్గులతో అగ్నిప్రమాదం

పట్నంబజారు, న్యూస్‌టుడే: పాతగుంటూరు మాచిరాజువారివీధిలోని చక్రధరరావు ఇంట్లోని ఏసీకి మంగళవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడి ఒక్కసారిగా మంటలు ఏర్పడ్డాయి. వెంటనే స్థానికులు విషయాన్ని అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. సంఘటనలో ఏసీ పూర్తిగా అగ్నికి ఆహుతి అవ్వడంతోపాటు, భవంతి గోడలు దెబ్బతిన్నాయి. విద్యుత్తు సరఫరాలో జరిగిన హెచ్చు తగ్గుల కారణంగానే మంటలు వ్యాపించాయని అగ్నిమాపకశాఖ అధికారులు వెల్లడించారు.


మాతృభక్తి మన సంస్కారం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తల్లికే మొదటి నమస్కారం మన సంప్రదాయమని సుందర సత్సంగ్ సభ్యుడు కేవీ కోటేశ్వరరావు తెలిపారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆది శంకరాచార్యస్వామి జయంతి సందర్భంగా మంగళవారం 'మాతృదేవోభవ' అనే అంశంపై కేవీ కోటేశ్వరరావు ప్రసంగించారు. తల్లిని గౌరవించడం మన సంస్కారమని వేదాలు పేర్కొన్నాయన్నారు. ఆ భగవంతుడి ప్రతిరూపమే తల్లి అని, ప్రాణం ఉన్నంత కాలం తల్లిదండ్రుల సేవలు చేసినవారికి సౌభాగ్యం కలుగుతుందన్నారు. తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

వడదెబ్బకు చిరు వ్యాపారి మృతి

కారంచేడు, న్యూస్‌టుడే: వడదెబ్బకు గురై చిరు వ్యాపారి మంగళవారం మృతి చెందారు. గుంటూరులోని పట్నంబజార్‌కు చెందిన ఎ.సత్యనారాయణ(52) ద్విచక్ర వాహనంపై తిరుగుతూ స్పాంజీల వ్యాపారం చేస్తుంటారు. మంగళవారం కారంచేడు మండలంలోని గ్రామాల్లో వ్యాపారం చేసుకుని వచ్చి సాయంత్రం దగ్గుబాడు బస్టాండ్‌లో కూర్చొని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు మృతుడి వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



అరుంధతినగర్ 5వ వీధిలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత పగిలి ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్‌పై నాపరాళ్లతో మూతను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల కిందట ఆ మూత పగిలిపోవడంతో గుంత పడింది. రాత్రి సమయంలో ఆ గుంత సరిగా కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

పడకేసిన పారిశుద్ధ్యం


కాలువలో తొలగించని వ్యర్థాలు


ఇళ్లముందు చెత్తకుప్ప

స్థానిక జానీనిచ్చంజయనగర్‌లో ఇళ్ల ముందు చెత్తకుప్పలను వారం రోజులుగా తొలగించలేదని స్థానికులు వాపోతున్నారు. కాలువలు తీయకుండా వదిలేయడంతో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలడంలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు నిండి కాలువ నుంచి రోడ్లపై పొంగుతున్నాయని వాపోయారు. వారం రోజులుగా ఇళ్ల ముందు వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసనలు, దోమల బెడద భరించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

గుంటూరు పశ్చిమ

మంచి భవిష్యత్తుంది.. కష్టపడి పని చేయండి


ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన రాయపాటి శైలజ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'మీకు మంచి భవిష్యత్తు ఉంటుంది. కష్టపడి పని చేయండి'.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన రాయపాటి శైలజను అభినందించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబును ఆమె మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజధాని అమరావతి ఉద్యమంలో ఏవిధంగా అయితే కష్టపడి పని చేశారో.. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా కూడా అదేవిధంగా సేవలు అందించాలని సూచించారు. శైలజ స్పందిస్తూ తనపై నమ్మకం ఉంచి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు.

ఏ కార్యకలాపాలైనా కంట్రోలర్‌కు తెలియజేయాల్సిందే!

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్ర ఎవాంజెలికల్ లూథరన్ సంఘం(ఏఈఎల్‌సీ) పరిధిలో ఏ కార్యకలాపాలైనా పరిపాలనా బాధ్యతల్లో ఉన్న కంట్రోలర్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్‌కు తెలియజేయాల్సిందేనని పరిపాలనా నిర్వాహకులుగా ఉన్న కేరళ హైకోర్టు విశ్రాంత జడ్జీ జస్టిస్ పీఎస్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఏపీ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 25.04.25 నుంచి కంట్రోలర్‌గా జస్టిస్ కురియన్ జోసెఫ్ ఉన్నారని తెలిపారు. ఏఈఎల్‌సీ సంఘానికి సంబంధించి పరిపాలనా విషయాలు ఉంటే కంట్రోలర్‌కు గాని, పరిపాలనా నిర్వాహకునికి గాని, కంట్రోలర్ కార్యదర్శి, ఏపీ విశ్రాంత జూనియర్ జడ్జి నేలటూరి జేసురత్న కుమార్‌కు గాని తెలియజేయాలని పేర్కొన్నారు. ఏఈఎల్‌సీ పరిధిలోని వ్యక్తులు, గ్రూపులు, సంఘాల్లో ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికలు, ఇతర ఏ స్థాయి ఎన్నికలు జరుపకూడదన్నారు. కంట్రోలర్ ఉత్తర్వులను అనుసరించి మాత్రమే ఎన్నికల నిర్వహించుకునే వీలు ఉంటుందని తెలిపారు. ఎన్నికలు నిర్వహించినా వాటికి ఎటువంటి చట్టబద్ధత ఉండదన్నారు. ఆటువంటి ఎన్నికలు ఏపీ హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించడమే అవుతుందన్నారు. ఏ వ్యక్తులు అయినా కంట్రోలర్ ఉత్తర్వులు, నియమాలను, హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకపోతే తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

చెత్త తొలగింపు: శ్రీరామనామ క్షేత్రం ప్రధాన వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ మార్గంలో వెళ్లాలంటే ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సి వస్తుంది. సమస్యను మేమున్నాం మీకు తోడుగా ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వీధుల్లో చెత్త తొలగించారు.

మురుగు సమస్య పరిష్కారం: నగరంపాలెం జెండా చెట్టు వీధిలోని కాల్వల్లో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం కలుగుతోంది. సమస్యను మేమున్నాం మీకు తోడుగా ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు కాల్వల్లో పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. -న్యూస్‌టుడే, నగరంపాలెం

స్పందనకు వందనం

పనుల పూర్తికి చర్యలు

నగరపాలకసంస్థ: నగరంలో ప్రాధాన్యమున్న అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం ఆయన కమిషనర్ శ్రీనివాసులు, అధికారులతో కలిసి ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి, మట్టుగుంట చెరువు అభివృద్ధి పనులు పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ చుట్టుగుంట చెరువు, వాకింగ్ ట్రాక్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం జరగాలన్నారు.

క్యూరింగ్ చేయకపోతే ఎలా?


సిమెంట్ రోడ్డుకు కట్టలు వేసి నీళ్లు పెట్టకుండా వదిలేశారిలా..

రత్నగిరినగర్ శ్రీపృష్టి విగ్రహం రహదారిని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేశారు. కనీసం కొన్ని రోజులైనా నీటితో క్యూరింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడ రహదారికి కట్టలు ఏర్పాటు చేసినా క్యూరింగ్ చేయడంలేదు. ఓవైపు ఎండలు మండిపోతున్నాయి. క్యూరింగ్ చేయకుండా ఆవిధంగా వదిలేస్తే సిమెంట్ రోడ్డు మన్నిక ఎన్నాళ్లు ఉంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే గుత్తేదారు ఈవిధంగా వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. సిమెంట్ రోడ్డు క్యూరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పట్టాభిపురం.

ధర వరలు



కృష్ణనగర్ రైతుబజారులో నిన్నటి ధరలు(కిలో రూ.లో): టమాట 16, వంగ 27, బెండ 30, పచ్చిమిర్చి 27, కాకర 45, బీర 44, క్యాబేజి 17, క్యారెట్ 32, దొండ 23, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 18, గోరుచిక్కుడు 35, దోస 17, సొర 20, పొట్లకాయ 25, అరటికాయ 7, చామదుంప 38, బీట్‌రూట్ 30, కీరదోసకాయ 39, బీన్స్ 84, క్యాప్సికమ్ 55, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 40, అల్లం 44, వెల్లుల్లి 94. -న్యూస్‌టుడే, పట్టాభిపురం

ట్రాఫిక్ వెతలు తీరేదెన్నడు?

★ పట్టించుకోని పోలీసులు
★ ఆక్రమణలు తొలగించని అధికారులు


గుజ్జనగుండ్ల సెంటర్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో నిలిచిన ట్రాఫిక్


స్తంభాలగరువు దాటాక షాదీఖానా జంక్షన్‌లో వాహనాల రద్దీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: శంకర్‌విలాస్ వంతెన విస్తరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. త్వరలో పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో నగరంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు, రోడ్లపై ఆక్రమణలు తొలగించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధాన మార్గాల్లోని హోటళ్ల వద్ద రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నా.. చర్యలు తీసుకోవడంలేదు. వేళాపాళా లేకుండా భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తున్నా పట్టించుకోవడంలేదు. ఫ్లైఓవర్ల వద్ద ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాల్సిన నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం సైతం ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఫలితంగా నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారవుతోంది.

ట్రాఫిక్ పోలీసులు ఎక్కడ

గుజ్జనగుండ్ల సెంటర్‌లో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అటు పలకలూరు రోడ్డు, ఇటు ఎస్వీఎన్ కాలనీలోకి వెళ్లేందుకు వాహనచోదకులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. సెంటర్‌లో టీ దుకాణాలు, అల్పాహార హోటళ్ల వద్ద వాహనాలు రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. అదే సమయానికి భారీ వాహనాలు అటువైపుగా నగరంలోకి వస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రస్తుతం ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. పలకలూరు రోడ్డులోని పలు విద్యాసంస్థల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సిన విద్యార్థులు సమయానికి చేరుకుంటామో.. లేదోనని ఒత్తిడికి గురవుతున్నారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ట్రాఫిక్ పోలీసులు అటువైపు చూడడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరికి వారు ముందు వెళ్లాలన్న తొందర్లో వాహనాలు అడ్డుపెట్టుకోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేసి.. ఎవరికి వారు పనులు చూసుకుని ఎప్పుడో వస్తున్నారు. ఇసుక, కంకరతో 10, 12 టైర్ల వాహనాలు పట్టాభిపురం మీదుగా స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నాయి.

వంతెన పనులు ప్రారంభమైతే..

ప్రధాన రహదారులపై ఆక్రమణలు, ఫ్లైఓవర్ల వద్ద ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయడంపై నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికీ దృష్టి సారించలేదు. పరిస్థితి ఇప్పుడే ఇవిధంగా ఉంటే.. రాబోయే రోజుల్లో శంకర్‌విలాస్ వంతెన పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్య ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుందని వాహనచోదకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకుని రహదారులపై వాహనాలు నిలిపేవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించడంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మాతృభక్తి మన సంస్కారం


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తల్లికి మొదటి నమస్కారం మన సంప్రదాయమని సుందర సత్సంగ్ సమ్మ్యద కేవీ కోటేశ్వరరావు తెలిపారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆది శంకరాచార్య స్వామి జయంతి సందర్భంగా మంగళవారం 'మాతృదేవోభవ' అనే అంశంపై కేవీ కోటేశ్వరరావు ప్రసంగించారు. తల్లిని గౌరవించడం మన సంస్కారమని వేదాలు పేర్కొన్నాయన్నారు. ఆ భగవంతుడి ప్రతిరూపమే తల్లి అని, ప్రాణం ఉన్నంత కాలం తల్లిదండ్రుల సేవలు చేసేవారికి సౌభాగ్యం కలుగుతుందన్నారు. తొలుత కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఆదాయం, జనాభా ప్రాతిపదికన గ్రేడ్‌లు

కలెక్టరేట్: జనాభా, ఆదాయం ప్రాతిపదికన పంచాయతీల గ్రేడ్‌లు నిర్ణయించాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.కోటికి పైగా ఆదాయం, పది వేల మంది పైబడి జనాభా ఉన్న గ్రామాలను ప్రత్యేక గ్రేడ్ పంచాయతీగా, రూ.50 లక్షల నుంచి రూ.కోటి లోపు ఆదాయం, 4 నుంచి 10 వేల జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-1గా, 2 నుంచి 4 వేల జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-2గా, 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-3గా గుర్తించాలని చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు.

వసతిగృహం అభివృద్ధికి దాతల సహకారం ఎనలేనిది


డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణను సత్కరిస్తున్న వడ్లమూడి నాగేంద్రం, మల్లెల హరీంద్రనాథ్ చౌదరి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ప్రాంత విద్యార్థినుల వసతిగృహం అభివృద్ధికి దాతల సహకారం ఎనలేనిదని సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు పేర్కొన్నారు. కమ్మజన సేవా సమితి ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. సమితి 47 సంవత్సరాలు పూర్తి చేసుకుని 48వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా 1978 నుంచి పాలకవర్గంలో సేవలందించిన పెద్దలను సత్కరించారు. ఇందులో భాగంగా ప్రముఖ సీనియర్ వైద్యుడు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణను పాలకవర్గ సభ్యులు సత్కరించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతక్కి రామకృష్ణప్రసాద్, చల్లా రాజేంద్రప్రసాద్‌లు ఇచ్చిన భారీ విరాళాలతో అత్యాధునిక వసతులతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ మాట్లాడుతూ వసతిగృహంలోని సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బొప్ప సుబ్బారావు, సూర్యదేవర హనుమంతురావు, పి.నాగేశ్వరరావు, రాయని రమణ మాట్లాడారు. సమితి సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వడ్లమూడి నాగేంద్రం, మల్లెల హరీంద్రనాథ్ చౌదరి, మర్రిపూడి సీతారామయ్య, ఘంటా పున్నారావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, కావూరి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఏటీ అగ్రహారం: వేణుగోపాలనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఎన్జీవోస్ కాలనీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఎన్జీవో కాలనీ పార్క్ దగ్గర వాకర్స్ సంఘ అధ్యక్షులు సుబ్బారావు సమక్షంలో వాకర్స్‌కు, చిన్నారులకు, వృద్ధులకు మజ్జిగ పంపిణీ చేశారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. మంగళవారం తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు అశోక చక్రవర్తి, గౌతమ బుద్ధుని జీవిత చరిత్రలు వివరించారు. విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బి.వి.ప్రసాద్‌లింగం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత పుస్తకాలను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, గ్రంథపాలకులు కె.చిన్నపరెడ్డి, ఎన్.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కలెక్టరేట్

ప్రయోగాత్మకంగా ఘన వ్యర్థాల నిర్వహణ


ఇంటింటి చెత్త సేకరించి తరలిస్తున్న కార్మికులు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు అనేక పనులు అమలు చేస్తున్నారు. స్వచ్ఛత ఆవశ్యకత గురించి క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి తెలియజేసి ప్రజా భాగస్వామ్యంతో పక్కాగా పారిశుద్ధ్యం అమలు చేసేలా నూతన విధానాన్ని తీసుకురానున్నారు. దీనిలో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని ఐదు డివిజన్లను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని ఆయా ప్రాంతాల్లో స్వయం సహాయ వ్రసంఘాలు (డ్వాక్రా) గ్రూపు మహిళలకు బాధ్యతలు అప్పగించనున్నారు. నిబంధనల మేరకు ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, తరలింపు, రహదారులు, సైడు కాలువల శుభ్రం, ఫాగింగ్ వంటివి అమలు చేసి ఘన వ్యర్థాల నిర్వహణలో మిగిలిన డివిజన్లకు ఆదర్శంగా నిలిచేలా చూడనున్నారు. ఇందుకు ప్రజారోగ్య విభాగం నుంచి సహకారం అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. త్వరలోనే ఆయా డివిజన్లలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నూతన విధానాన్ని అమలులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన డివిజన్లు, ప్రాంతాలు

- ✤ తూర్పు నియోజకవర్గంలో 9వ డివిజన్ బీఆర్ స్టేడియం, పాతగుంటూరు యాదవబజారు, 12వ డివిజన్ సంగడిగుంట
- ✤ పశ్చిమం.. 21వ డివిజన్ కేవీపీ కాలనీ, కృష్ణబాబు కాలనీ, 22వ డివిజన్ శ్రీనివాసరావుతోట
- ✤ ప్రత్తిపాడు.. 46వ డివిజన్ సీతారామ్‌నగర్, బాలాజీనగర్, హనుమాన్‌నగర్, శ్రీరాంనగర్, అన్నపూర్ణనగర్, గోరంట్ల, ఆఫీసర్స్ కాలనీ.

విజయవంతమైతే మరిన్ని ప్రాంతాలకు విస్తరణ..

స్వయం సహాయక సంఘాలతో కలిసి నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛత కార్యక్రమం విజయవంతమైతే నగరంలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛత కార్యక్రమంలతోపాటు తడి చెత్తను కంపోస్ట్ తయారు చేయడం, క్లస్టర్ కంపోస్ట్ విధానాలు అమలు చేస్తే ఉపయోగం ఉంటుంది. కంపోస్ట్ తయారీతోపాటు ఆయా డివిజన్లలో మిద్దె, పెరటి తోటల పెంపకంపై కూడా ఇంటింటికీ అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. కంపోస్ట్ తయారీ, మిద్దె, పెరటి తోటల పెంపకానికి ఏళ్లుగా జీఎంసీ పరిధిలో కృషి చేస్తున్న ఐటీసీ ఫినిష్ సంస్థ, బంగారు భవిష్యత్తు ప్రాజెక్టు ప్రతినిధులనూ ఈ కార్యక్రమం పరిధిలోకి తీసుకొస్తే ఫలితాలు మరింత మెరుగ్గా వచ్చే అవకాశం ఉంటుంది..

నగర ప్రగతికి బిల్డర్ల సహకారం అవసరం


మేయర్ రవీంద్రకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న నాగ వంశీ తదితరులు

పట్టాభిపురం, నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: గుంటూరు నగరాభివృద్ధిలో బిల్డర్స్ భాగస్వాములు కావాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో నేరెడ్కో బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో అంతర్భాగంగా ఉన్న గుంటూరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బిల్డర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎంసీ అనుమతించిన ప్లాను ప్రకారం, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. నెరెడ్కో అధ్యక్షుడు పెరవల్లి నాగవంశీ, కార్యదర్శి శ్రీనాథ్, కోశాధికారి అర్జున్‌సాయి, సలహా కమిటీ ఛైర్మన్ గద్దె తిరుపతిరావు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో చోరీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రవీంద్రనగర్‌లో చోరీ జరిగినట్లు పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. విశ్రాంత ఉద్యోగి రాధారమణ రవీంద్రనగర్‌లోని రెండోలైనులో నివాసం ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 6న హైదరాబాద్ వెళ్లారు. ఇది గమనించిన దొంగలు పనిమనిషి రాకపోకలు సాగించే గేటును తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు కూడా అందుబాటులోనే ఉండడంతో.. దొంగలు అందులో ఉన్న రెండు కేజీల వెండి వస్తువులు, ఆరు గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. మంగళవారం ఊరు నుంచి వచ్చిన రాధారమణ ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిప్యూటీ ఈఈగా సుబ్బరావమ్మ

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: గుంటూరు సర్కిల్ డిప్యూటీ ఈఈ(కమర్షియల్)గా సుబ్బరావమ్మను నియమిస్తూ సెంట్రల్ డిస్కం సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం డిప్యూటీ ఈఈ(ప్రొటెక్షన్)గా పని చేస్తున్నారు. ఆమె స్థానంలో ఏఈగా పని చేస్తున్న బలరామిరెడ్డిని పదోన్నతిపై నియమించారు.

విధుల్లో చేరిక

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాల ఔషధ శాస్త్ర విభాగంలో ఆచార్య శ్రీదేవి విధుల్లో చేరారు. పాడేరు వైద్య కళాశాలలో పని చేస్తున్న ఆమెను గుంటూరుకు బదిలీ చేశారు.

రాజేష్‌ఖన్నా సేవలు అభినందనీయం


రాజేష్‌ఖన్నాకు మెమెంటో ఇస్తున్న మూర్తి

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: గుంటూరు సర్కిల్ డిప్యూటీ ఈఈ(కమర్షియల్)గా పని చేసిన రాజేష్‌ఖన్నా ఉత్తమ సేవలందించి అందరి మన్ననలు పొందారని పర్యవేక్షక ఇంజినీరు కేవీఎల్ఎన్ మూర్తి కొనియాడారు. బాపట్ల సర్కిల్ ఈఈ(ఎంఆర్‌టీ)గా పదోన్నతిపై వెళ్తున్న రాజేష్‌ఖన్నాకు విద్యుత్తు భవన్‌లో మంగళవారం జరిగిన అభినందన సదస్సులో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుంటూరు టౌన్-1 డివిజన్ ఈఈ శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం శకుంతల


పారిశుద్ధ్య కార్మికురాలికి వస్త్రాలు అందజేస్తున్న రాయపాటి శ్రీనివాస్, మాదల రత్నగిరిబాబు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: సేవకు ప్రతిరూపం మాదల శకుంతల అని వారి కుమారుడు మాదల రత్నగిరిబాబు అన్నారు. మంగళవారం ఆమె ప్రథమ వర్ధంతి సందర్భంగా తారకరామనగర్‌లోని మాదల శంకుతల, భాస్కర్ నర్సింగ్ కళాశాల ఆవరణలో వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ చేతుల మీదుగా వస్త్రాలు పంపిణీ చేశారు. మాదల రత్నగిరిబాబు, మాదల చైతన్య, శ్రీరామ్‌లు మాట్లాడుతూ మాదల శకుంతల పేదల కష్టాలను ఆమె కష్టాలుగా భావించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. డాక్టర్ పాటిబండ్ల శివాజీ, డాక్టర్ పూజ, నర్సింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాపలాదారుపై చెప్పుతో దాడి.. మహిళపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కాపలాదారుపై చెప్పుతో దాడి చేసిన మహిళపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. శ్యామలనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న రమాదేవి తన వాహనానికి ఎవరో వాహనం అడ్డు పెట్టారన్న కోపంతో పట్టించుకోలేదని కాపలాదారు రాజ్యలక్ష్మిపై చెప్పుతో దాడి చేసింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో సత్తా


ప్రతిభ చూపిన లలిత శరణ్య, నిధి తోష్నివాల్, విజయసారథి

తాడికొండ, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్షా ఫలితాల్లో డిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పది పరీక్షల్లో గుంటూరు జిల్లాలో తమ విద్యార్థులు ఉత్యుత్తమ మార్కులు పొందారని పేర్కొన్నారు. 12వ తరగతిలో శ్రీసాయిదారహాస్ సనగరం 96.2 శాతం, కొమ్మనబోయిన మహేష్‌కుమార్ 94.2, కౌశిక్‌సాయి పబ్బిసెట్టి 91 శాతం మార్కులు సాధించారని తెలిపారు. అలాగే పదిలో చల్లా లలితశరణ్య 98.4, నిధి తోష్నివాల్ 97.4, ఇపూరి విజయసారథి 96.4 శాతం మార్కులు సాధించారని ఆయన తెలిపారు. పాఠశాల ప్రో. వైస్ ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, డైరెక్టర్స్ రాకేష్, ప్రియాంక, అకడమిక్ డైరెక్టర్ ఉషారాణి, ప్రిన్సిపల్ రత్నమాలలు విద్యార్థులను అభినందించారు.

కేఎల్‌పీ విద్యార్థుల జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న కార్యదర్శి కృష్ణప్రసాద్ తదితరులు

నవభారత్‌నగర్, న్యూస్‌టుడే: సీబీఎస్ఈ ఫలితాల్లో జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. 12వ తరగతిలో మొత్తం 70 మంది పరీక్షకు హాజరు కాగా.. 34 మంది ప్రథమ శ్రేణిలో, 14 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారన్నారు. 10వ తరగతిలో 144 మందికి 127 మంది ప్రథమ శ్రేణిలో, 64 మంది డిస్టింక్షన్, 15 మంది 90 శాతం పైగా మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు పాఠశాల పాలకవర్గం అభినందించింది.

పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందించిన విష్ణువర్ధన్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కార్యదర్శి విష్ణువర్ధన్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాలలో మంగళవారం ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ నూరు శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. వెంకట వాసవి స్వప్నరాగ 478, శ్రావణి 473, కీర్తన 472 మార్కులు సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.